# సెస్‌పై విలీనం కుట్ర..?




- మరోసారి ఎన్పీడీసీఎల్‌లో కలిపే ప్రతిపాదనలు
- లాభాల బాటలో సెస్ పయనం
- నెలసరి ఆదాయం ఈఆర్సీ సిఫార్స్‌కు మించి ఆదాయం
- ప్రభుత్వ బకాయిలు భారం రూ.960 కోట్లు
- పవర్‌లూమ్ విద్యుత్ సబ్సిడీ బకాయిలు రూ.101.77కోట్లు పెండింగ్

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

చీకట్లలో ఉన్న సిరిసిల్ల ప్రాంతానికి వెలుగులు పంచిన సిరిసిల్ల సహకార విద్యుత్ సరఫరా సంఘం (సెస్) కొద్దిరోజులుగా అవినీతి ఆరోపణలు, ఎన్పీడీసీఎల్‌లో కలపాలనే ప్రతిపాదనలతో సతమతమవుతోంది. వివిధ రాజకీయాల మధ్య సెస్‌పై విలీనం కుట్ర మొదలైందని వాదనలు వినిపిస్తున్నాయి. నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ విద్యుత్ టారిఫ్ ప్రతిపాదించిన 2024-25 నుంచి 2028-29 డిస్ట్రిబ్యూషన్ బిల్లులు, విద్యుత్ టారిఫ్ సవరణలు విచారణ సందర్భంగా కొంతమంది సెస్‌ను ఎన్పీడీసీఎల్‌లో కలపాలి అనే అంశాన్ని లేవనెత్తారు.

ఇదే క్రమంలో సెస్ సంస్థలో వ్యాపారం నిర్వహణ సరిగా లేదని బిల్లుల చెల్లింపు బకాయిలను సూచిస్తూ ఎన్పీడీ సీఎల్‌లో విలీనం చేయాలని ప్రభుత్వానికి ఈఆర్సీ సిఫార్సు చేసింది. సెస్ ద్వారా విద్యుత్ సంస్థలకు రూ.1095.88 కోట్లు చెల్లించాల్సి ఉందని సూచించింది. ఇందులో విద్యుత్తు కొనుగోలు బిల్లు రూ 590.84 కోట్లు ఉండగా సర్‌చార్జి రూ505.04 కోట్లు ఉంది. ఇదే సమయంలో సెస్‌కు రావలసిన బకాయిలు రూ 960.78 కోట్లు ఉన్నాయి. ఇందులో బకాయిలు రూ 751.10 కోట్లు ఉండగా సర్‌చార్జి రూ 209.68 కోట్లు ఉంది. లెక్కలు ఎలా ఉన్నా సిరిసిల్ల సెస్ వినియోగదారులు ఎన్పీడీసీఎల్‌లో విలీనాన్ని వ్యతిరేకిస్తూ వస్తున్నారు. నాలుగు రోజుల క్రితం మరోసారి ఎన్పీడీసీఎల్‌లో విలీనానికి సంబంధించి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాష్ట్ర సహకార రిజిస్ట్రార్‌ను అభిప్రాయం కోరినట్లు తెలుస్తోంది. దీంతో మరోసారి సెస్ వినియోగదారుల్లో ఆందోళనలు మొదలయ్యాయి. లాభాల బాటలో పయనిస్తున్న సెస్‌ను కాపాడుకోవడానికి ఉద్యమాలకు సైతం సిద్ధమయ్యే పరిస్థితి నెలకొంది.

## 27 ఏళ్ల క్రితమే ప్రైవేటీకరణకు కుట్ర..

దేశంలోనే సహకార రంగంలో విద్యుత్ వెలుగులు పంచుతున్న గ్రామీణ సహకార విద్యుత్ సరఫరా సంస్థలకు 27 ఏళ్ల క్రితం పట్టిన ప్రైవేటీకరణ గ్రహణం వీడడం లేదు. విద్యుత్ సంస్కరణల పేరుతో అప్పటి ప్రభుత్వం రాష్ట్ర విద్యుత్ బోర్డును రెండు ముక్కలుగా చీల్చి జెన్‌కో ట్రాన్స్‌కోగా విభజించినది అందరికీ తెలిసిందే, ఇదేక్రమంలో 1998లో ఏర్పాటుచేసిన సుబ్రహ్మణ్యం అధ్యయన కమిటీ గ్రామీణ విద్యుత్ సంస్థలను రద్దు చేయడం లేదా ప్రైవేటీకరణకు సిఫార్సు చేసింది. దీనికి వ్యతిరేకంగా ఏర్పడిన నిరసనలు, ఆందోళనల, ఫలితంగా అప్పుడు ప్రభుత్వం వెనకంజ వేసింది. 23జూలై 2002లో జీవో 331 ద్వారా రాష్ట్రంలో 20 సంస్థలను ప్రైవేటీకరించే జాబితాలో తొమ్మిది గ్రామీణ సహకార విద్యుత్ సరఫరా సంస్థలను కూడా చేర్చింది. ఆనాటి నుంచి నేటి వరకు తరచూ విలీనం వివాదం ముందుకు వస్తూనే ఉంది.

సహకార ప్రాతి పదికన విద్యుత్ సరఫరా సంస్థలను ఏర్పాటు చేయాలని 1969లో కార్యకలాపాలు కేంద్ర ప్రభుత్వం మొదలుపెట్టింది. గ్రామీణ విద్యుదీకరణ సంస్థ దేశంలో మొట్టమొదటిగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్రలలో పైలెట్ ప్రాజెక్టుగా మొదలు పెట్టారు ఇందులో ఉమ్మడి రాష్ట్రంలో ఏర్పాటుచేసిన విద్యుత్ సొసైటీలలో 1970లో ఏర్పాటు చేసిన సిరిసిల్ల సహకార విద్యుత్ సరఫరా సంఘం మొదటిది. దీని తర్వాత ఉమ్మడి రాష్ట్రంలో 1982లో తొమ్మిది గ్రామీణ సహకార విద్యుత్ సరఫరా సంఘాలను నెలకొల్పారు. ప్రస్తుతం ఆంధ్రాలో చిత్తూరు జిల్లా కుప్పం, విజయనగరం జిల్లా చీపురుపల్లి, తెలంగాణలో సిరిసిల్ల సొసైటీలు మాత్రమే పనిచేస్తున్నాయి. మిగిలిన సొసైటీలను విద్యుత్ సంస్థల్లో విలీనం చేశారు. ఎన్పీడీసీఎల్ సెస్‌ను విలీనం చేసే ప్రయత్నాల వల్ల సిరిసిల్ల వెలుగుల భవిష్యత్తును ప్రశ్నార్థకంగా నిలబెడుతుందని చర్చించుకుంటున్నారు.

## సెస్‌కు భారంగా బకాయిలు రూ 960.78 కోట్లు

రాజన్న సిరిసిల్ల జిల్లాలో చీకట్లను పారద్రోలి వెలుగులు నింపడానికి 1970లో 420 సర్వీసులతో ప్రారంభమైన సహకార విద్యుత్ సరఫరా సంఘంలో ప్రస్తుతం 3 లక్షల 46వేల 167 మంది సభ్యులు ఉన్నారు. గృహ కనెక్షన్లు 171510, వాణిజ్య కనెక్షన్లు 21486 కనెక్షన్లు, పరిశ్రమల కనెక్షన్లు 1528, పవర్‌లూం కనెక్షన్లు 5635, వ్యవసాయ కనెక్షన్లు 78611, గ్రామ పంచాయతీ వాటర్ కనెక్షన్లు, విద్యుత్ దీపాల 3118, దేవాలయాలు, పాఠశాలలు, ప్రభుత్వం కార్యాలయాల కనెక్షనులు విద్యుత్ రంగంలోనే ప్రత్యేకతను సాధించిన సెస్‌కు ప్రభుత్వం, వినియోగదారులు, వివిధ సంస్థలు చెల్లించాల్సిన బకాయిలు గుదిబండగా మారాయి. ప్రస్తుతం సెస్‌కు రూ 960.78 కోట్ల బకాయిలు రావాల్సి ఉంది. ఇందులో ప్రభుత్వం, ప్రభుత్వ రంగ సంస్థల నుంచి దాదాపు రూ 781.81 కోట్ల బకాయిలు రావాల్సి ఉంది.

ఇందులో సిరిసిల్ల మరమగ్గాల పరిశ్రమకు 50 శాతం సబ్సిడీ బకాయిలు రూ 51.85 కోట్లు, దీనికి సర్‌చార్జ్‌గా రూ 49.92 కోట్లుతో కలిపి రూ 101.77 కోట్లు ప్రభుత్వం నుంచి రావాల్సి ఉంది. జిల్లాలో 260 గ్రామ పంచాయతీలు ఉండగా వీటికి సంబంధించిన నీటి సరఫరా, వీధి దీపాలకు సంబంధించి 31 జూన్ 2020 నాటికి రూ 319.52 కోట్లు బకాయిలు పేరుకుపోయాయి. వ్యవసాయ విద్యుత్ సబ్సిడీకి సంబంధించి రూ 220.11కోట్ల బకాయిలు ఉన్నాయి. పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి బిల్లులు రూ 20.27 బకాయిలు ఉన్నాయి. ప్రస్తుతం జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాలు,

మిగతా 8వ పేజీలో

## ఎస్సీ హాస్టల్స్‌కు 119 విద్యార్థుల ఎంపిక

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయంలో బుధవారం 2025-26కు సిరిసిల్ల డివిజన్ స్థాయిలో ఎస్సీ హాస్టల్స్‌లో విద్యార్థుల ప్రవేశాల ఆమోదంపై ఆర్డీవో వెంకటేశ్వర్లు అధ్యక్షతన అడ్వయిజరీ కమిటీ సమావేశం జరిగింది. సిరిసిల్ల, గంభీరావుపేట, ముస్తాబాద్, ఇల్లంతకుంట మండలాలకు చెందిన ఎస్సీ హాస్టల్స్‌లో మొత్తం 119 మంది విద్యార్థుల ఎంపికకు కమిటీ ఆమోదం తెలుపగా మరో 254 సీట్లు ఖాళీలు ఉన్నాయి. ఈ సమావేశంలో ఏఎస్‌డబ్ల్యూవో,తహసీల్దార్లు, ఎంపీడీవోలు, సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్ పాల్గొన్నారు.

## మినీ స్టేడియం నిర్మాణానికి నిధులు కేటాయించండి..


లేఖను అందజేస్తున్న రవీందర్

బోయినపల్లి, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): బోయినపల్లి మండల కేంద్రంలో మినీ స్టేడియం నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డికి చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం బుధవారం లేఖ రాశారు. అట్టి లేఖను జిల్లా కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ అధ్యక్షుడు కూన రవీందర్ హైదరాబాద్ స్పోర్ట్స్ అథారిటీ ఛాంబర్‌లో చైర్మన్‌ను కలిసి అందజేశారు. బోయినపల్లిలో మినీ స్టేడియం నిర్మాణానికి ప్రభుత్వం 4 ఎకరాల స్థలం ఇచ్చింది. స్టేడియం నిర్మాణంలో చేపట్టాల్సిన ప్లేగ్రౌండ్స్ డిజైన్ రూపొందించి చైర్మన్‌కు అందజేశారు. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చొరవతో 20 కోట్ల నిధులు త్వరలో మంజూరుకానున్నట్లు కూన రవీందర్ తెలిపారు.

## ప్లాస్టిక్ నిషేధం దిశగా అడుగులు..

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ప్లాస్టిక్ నిషేధం దిశగా పట్టణ ప్రజలు అడుగులు వేయాలని మున్సిపల్ కమిషనర్ ఖదీర్‌పాషా అన్నారు. బుధవారం మున్సిపల్ ఆధ్వర్యంలో 100డేస్ యాక్షన్‌ప్లాన్ విజయోత్సవ ర్యాలీని పట్టణ ప్రధాన రహదారుల గుండా నిర్వహించారు. అనంతరం జిల్లా కేంద్రంలోని బతుకమ్మ ఘాట్ వద్ద జరిగిన సమావేశంలో మున్సిపల్ సిబ్బందితో కమిషనర్ ప్రతిజ్ఞ చేయించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 100 డేస్ యాక్షన్ ప్లాన్ ఈనెల 2 నుంచి 10వరకు విజయవంతంగా నిర్వహించామన్నారు. 100డేస్ యాక్షన్ ప్లాన్ కార్యక్రమాన్ని సిబ్బంది నిరంతర ప్రక్రియగా కొనసాగించాలన్నారు. తడి, పొడి చెత్త వేరు చేసే విధానాన్ని ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్లాస్టిక్ నిషేధిత సిరిసిల్లగా తీర్చిదిద్దడంలో ప్రజలను అధికారులు ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# బాధితులను ప్రభుత్వం ఆదుకుంటుంది

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్


కార్యక్రమంలో మాట్లాడుతున్న విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ టౌన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయానికి వెళ్లే ప్రధాన రోడ్డు విస్తరణలో భాగంగా కొంత మందికి నష్టం జరిగిందని, అలాంటి వారిని ప్రభుత్వం తప్పకుండా ఆదుకుంటుందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సూచించారు. వేములవాడ పట్టణంలోని కుల సంఘాలకు మంజూరైన ప్రొసీడింగ్ ప్రతాలను బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేయలేని పనులను కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుందని అన్నారు. కొన్ని కఠిన నిర్ణయాలు తీసుకున్నప్పుడు ఒకరిద్దరికి నష్టం వాటిళ్ళుతుందని, దీంతో వేలాది మందికి లబ్ధిచేకూరుతుందని అన్నారు. నష్టం వాటిల్లిన నిర్వసితుల త్యాగం ఎప్పటికి మర్వలేనిదని, ప్రభుత్వం ఆదుకునేలా ముందుకు సాగుతున్నామని వివరించారు. ఇటీవలే రూ. 6 కోట్లతో 80 ఫీట్ల రోడ్డు విస్తరణకు శంకుస్థాపన చేశామని, మూడు మాసాల్లో రోడ్డు నిర్మాణం పూర్తి అవుతుందని అన్నారు. అభివృద్ధి కళ్ళ ముందు కనిపిస్తున్న కొందరు అప్పుడప్పుడు వచ్చి ఏం మాట్లాడుతున్నారో తెలియడం లేదని అన్నారు. వీ కంటికి మాత్రం అభివృద్ధి ఎందుకు కనిపిస్తలేదని ప్రశ్నించారు. రానున్న రోజుల్లో సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో వేములవాడ పట్టణంతో పాటు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నిలిపేందుకు ప్రణాళికలు జరుగుతున్నాయని వివరించారు. ఈ కార్యక్రమంలో రొండి రాజు, కనికరపు రాకేష్, సంద్రగిరి శ్రీనివాస్, పులి రాంబాబు, చిలుక రమేష్ తదితరులు ఉన్నారు.

# రైతులకు తప్పని యూరియా తిప్పలు


ఇల్లంతకుంటలో యూరియా కోసం బారులు తీరిన రైతులు


మరిమడ్లలో యూరియా కోసం బారులు తీరిన రైతులు

ఇల్లంతకుంట, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : యూరియా కోసం రైతులు పడుతున్న ఇబ్బందులు తొలగిపోవడం లేదు. మండల కేంద్రానికి, వల్లంపట్ల గ్రామాలలోని విక్రయ కేంద్రాలకు యూరియా రాగా బుధవారం పంపిణీ చేస్తామని అధికారులు ప్రకటించారు. దీనితో ఉదయమే రైతులు కేంద్రాల వద్ద బారులు తీరారు. వల్లంపట్ల గ్రామంలో వరుసలో చెప్పులను ఉంచారు. పంటలకు యూరియా వేసే సమయం దాటిపోతుందని, తర్వాత వేసినా ప్రయోజనం ఉండదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి రైతులకు సరపడ యూరియాను గ్రామాలకు సరఫరా చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

- ముస్తాబాద్ : మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై అన్నదాతల ఆందోళన వ్యక్తం చేశారు. రోడ్డుపై బైఠాయించి మండిపడ్డారు. రోజుల తరబడి యూరియా కోసం ఎదురు చూస్తున్న దొరకడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పంటల దిగుబడి వచ్చే పరిస్థితి లేదన్నారు. రోడ్డుపై బైఠాయించి మండిపడ్డారు. గ్రోమోర్‌లో 11 దాటిన దుకాణం తెరవడం లేదన్నారు.పోలీసులు చేరుకొని ధర్నాను విరమించేలా చూశారు. గంగల తరబడి నిలబడ లేక చెప్పులను క్యూలైన్‌లో పెట్టారు. ఈకార్యక్రమంలో మండల రైతులు తదితరులు పాల్గొన్నారు.
- కోనరావుపేట : యూరియా కోసం రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం నుండి సాయంత్రం వరకు పడి కాపులు కాసిన ఒక్క బస్తా యూరియా మాత్రమే ఇస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోనరావుపేట మండలం మరిమడ్ల గ్రామంలో యూరియా బస్తాల కోసం రైతులు పడిగాపులు కాశారు. ఒక్కో రైతుకు ఒక్కో బస్తా ఇవ్వడంతో యూరియా కోసం ఇబ్బందులు తప్పడం లేదని రైతులు ఆరోపించారు. అధికారులు స్పందించి యూరియా కొరత లేకుండా చూడాలని కోరారు.
- చందుర్తి : చందుర్తి మండలం ఎనగల్‌లో రైతులు యూరియా బస్తాల కోసం బారులు తీరారు. యూరియా కోసం గంటల తరబడి రైతులు నిరీక్షించారు. ఎన్గల్ గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో గ్రామానికి 450యూరియా బస్తాలను సరఫరా కాగా 240 మంది రైతులకు రెండు బస్తాల చొప్పున పంపిణీ చేశారు. ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5గంటల వరకు క్యూలైన్లో బారులు తీరారు. దాదాపు 60మంది రైతులకు బస్తాలు దొరకకపోవడంతో తీవ్ర నిరాశతో వెనుదిరిగారు. కాగా, మిగతా రైతులకు అధికారులు టోకెన్లు అందజేసి రెండు మూడు రోజుల్లో మళ్లీ యూరియా బస్తాలు సరఫరా చేస్తామని పేర్కొన్నారు.


ముస్తాబాద్‌లో చెప్పుల క్యూ..


రాష్ట్ర ఖజానాను ఖాళీ చేసిన కల్వకుంట్ల కుటుంబం.. 7
యథేచ్ఛగా కాలువ భూములు కబ్జా - పట్టించుకోని అధికారులు 8


## వీరనారి చాకలి ఐలమ్మను స్ఫూర్తిగా తీసుకోవాలి

- కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా


చాకలి ఐలమ్మకు నివాళులర్పిస్తున్న కలెక్టర్, అధికారులు

సిరిసిల్ల కలెక్టరేట్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : వీరనారి చాకలి ఐలమ్మ ఆశయాలను ప్రతిఒక్కరు స్ఫూర్తిగా తీసుకోవాలని కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా కోరారు. కలెక్టరేట్‌లో బుధవారం వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతిని నిర్వహించగా, కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా పాల్గొని ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వీరనారి చాకలి ఐలమ్మ గొప్ప పోరాట యోధురాలు అని, ఆమె ఆశయాలను ప్రతి ఒక్కరు స్ఫూర్తిగా తీసుకోవాలని అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో వీరనారి చాకలి ఐలమ్మ ముఖ్య భూమిక పోషించారని తెలంగాణ పౌరుషాన్ని పోరాటాన్ని, త్యాగాన్ని భావితరాలకు అందించి ఉద్యమస్ఫూర్తిని చూపిన గొప్ప పోరాటయోధురాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి సౌజన్య, వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## మెగా లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీరజ



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీరజ

సిరిసిల్ల క్రైం, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): జాతీయ మెగా లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్‌పర్సన్ పి. నీరజ అన్నారు. బుధవారం జిల్లా కోర్టులో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రజలకు న్యాయసేవలను చేరువయ్యేలా కృషిచేయాలన్నారు. జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో నిరుపేదలకు ఉచిత న్యాయం అందుతుందన్నారు. ఈనెల 13న జరిగే లోక్ అదాలత్‌లో రాజీ మార్గం ఉన్న క్రిమినల్, అన్ని సివిల్ కేసులకు లోక్‌అదాలత్‌లో పరిష్కారం లభిస్తుందన్నారు. భూతగాదాలు, బ్యాంకు రుణాలు, కుటుంబ కలహాలు, డ్రంకెన్‌డ్రైవ్, ట్రాఫిక్ ఉల్లంఘన, చెక్‌బౌన్స్, యాక్సిడెంట్ తదితర కేసుల్లో లోక్ అదాలత్ ద్వారా సేవలు వినియోగించుకోవాలన్నారు. సిరిసిల్ల, వేములవాడ కోర్టులలో 10బెంచ్‌లను ఏర్పాటుచేసి శనివారం ఉదయం 10.30గంటల నుంచి సాయంత్రం 5వరకు లోక్ అదాలత్ నిర్వహిస్తామన్నారు. ఇరువర్గాల్లోని కక్షిదారుల్లో ఎవరికైన ఆర్థిక స్థోమత లేకపోయిన న్యాయసేవా సంస్థను సంప్రదిస్తే సేవలు అందిస్తుందన్నారు. ఒకసారి లోక్ అదాలత్‌లో కేసు పరిష్కారం అయితే ఏ కోర్టుకు వెళ్లే అవకాశం లేదన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయసేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి రాధికా జైస్వాల్, లోక్ అదాలత్ సభ్యులు చింతోజు భాస్కర్‌లు పాల్గొన్నారు.

## మహిళల రక్షణే లక్ష్యంగా ముందడుగు : ఎస్పీ

సిరిసిల్ల క్రైం, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): మహిళల రక్షణే లక్ష్యంగా ముందడుగు వేస్తున్నామని ఎస్పీ మహేష్ బి. గీతే అన్నారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ షీటీం ఆధ్వర్యంలో కళాశాలలు, పాఠశాలలు, రద్దీ ప్రదేశాల్లో పోక్సో యాక్ట్, గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్, ఈవ్ టీజింగ్, మహిళల చట్టాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. మహిళల రక్షణే ధ్యేయంగా కార్యక్రమాలు చేపడుతామన్నారు. ఆయా పోలీస్‌స్టేషన్‌ల పరిధిలోని అన్ని కళాశాలలు, పాఠశాలల్లో సందర్శిస్తూ విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు చేపట్టడంతో పాటుగా విద్యార్థులకు సమస్యలు ఎదురైనపుడు వారు సంప్రదించే విధంగా షీటీం పనిచేస్తుందన్నారు. డయల్ 100, షీటీం నంబర్లు ఆయా కళాశాలలు, పాఠశాలల్లో ఏర్పాటుచేయాలన్నారు. విద్యార్థినీ, విద్యార్థులు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలన్నారు. సోషల్ మీడియాలో వేదికగా విద్యార్థినులపై వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు. మహిళలు, విద్యార్థినులు వేధింపులకు గురైతే జిల్లా షీటీం నంబర్ 871265 6425కు ఫిర్యాదు చేయాలన్నారు. జిల్లాలో ఏర్పాటుచేసిన షీటీం విద్యార్థుల, మహిళల సమస్యలపై వచ్చిన ఫిర్యాదులపై స్పందిస్తూ గత నెలలో 8కేసులు నమోదు చేసి ఆకతాయిలకు తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సిలింగ్ ఇచ్చామన్నారు.

## చికిత్సకు ఆర్థిక సహాయం అందించిన కలెక్టర్

సిరిసిల్ల కలెక్టరేట్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : వైద్య చికిత్స నిమిత్తం రూ 35వేలను కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా బాధితుని కుటుంబీలకు అందించారు. బోయిన్‌పల్లి మండలం రత్నంపేట గ్రామానికి చెందిన ఎదురుగట్ల నాగరాజు ఉపాధి కోసం గల్ఫ్ దేశానికి వెళ్లగా అక్కడ బ్రెయిన్ స్ట్రోక్‌తో పక్షవాతం రాగా కుటుంబీకులు స్వదేశానికి తీసుకవచ్చారు. కుటుంబ ఆర్థికపరిస్థితి బాగా లేదని, ఆయన వైద్యచికిత్స కోసం ఆర్థికసహాయం అందించాలని నాగరాజు భార్య లావణ్య కలెక్టర్‌ను కలిసి వేడుకుంది. దీంతో స్పందిన కలెక్టర్ బుధవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో నాగరాజు వైద్యచికిత్సల కోసం రూ 35 వేల చెక్కును లావణ్యకు అందించారు.

## మహాసభల కరపత్రం ఆవిష్కరణ

సిరిసిల్ల రూరల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలో ఈ నెల 15న జరిగే భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా మూడవ మహాసభలకు కార్మికులు విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి కోరారు. బీవైనగర్‌లోని అమృత్‌లాల్‌శుక్లా కార్మిక భవనంలో బుధవారం సీఐటీయూ భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన జిల్లా మూడో మహాసభల కరపత్రాలను ఆవిష్కరించారు. జిల్లా కేంద్రంలో జరిగే ఈ మహా సభలకు భవన నిర్మాణాల కార్మికులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణా కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు మిట్టపల్లి రాజమౌళి, గురజాల శ్రీధర్, కోల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## బీసీ డిక్లరేషన్ విజయోత్సవ సభ ఏర్పాట్లపై సమీక్ష



ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో పాల్గొన్న జిల్లా మంత్రులు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు

కరీంనగర్ అర్బన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఈ నెల 15న కామారెడ్డిలో నిర్వహించనున్న బీసీ డిక్లరేషన్ విజయోత్సవ సభకు జన సమీకరణ, సభ ఏర్పాట్లపై బుధవారం హైదరాబాద్‌లో సమావేశం నిర్వహించారు. బేగంపేట టూరిజం ప్లాజాలో ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జన సమీకరణ, సభ ఏర్పాట్లపై చర్చించారు. ఒక్కో జిల్లా నుంచి 15 వేల మందిని కామారెడ్డి సభకు తరలించాలని నిర్ణయించి సంబంధిత నియోజకవర్గ ఇన్‌చార్జిలకు బాధ్యతలు అప్పగించారు. సమావేశంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారు హర్కర్ వేణుగోపాల్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారయణ, రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్, మేడిపల్లి సత్యం, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, గ్రంథాలయ చైర్మన్లు సత్తు మల్లేశం, నాగుల సత్యనారాయణగౌడ్, నేరెళ్ల శారద, కేకే మహేందర్‌రెడ్డి, ప్రణవ్‌బాబు, వెలిచాల రాజేందర్‌రావు, బొమ్మ శ్రీరాంచక్రవర్తి పాల్గొన్నారు.

## గంభీరావుపేటలో వైరల్ ఫీవర్

● జ్వర బాధితులతో నిండిన ఆసుపత్రి



గంభీరావుపేట ప్రభుత్వ ఆసుపత్రిలో జ్వర పీడితులు

గంభీరావుపేట, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : గంభీరావుపేట మండలాన్ని వైరల్ ఫీవర్ వణికిస్తోంది. ప్రధానంగా మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి జ్వర పీడితులతో నిండిపోయింది. మూడు నాలుగు రోజుల నుంచి జ్వర పీడితుల సంఖ్య రోజురోజుకు పెరుగుతూ వస్తోంది. తీవ్రమైన తలనొప్పి, కాళ్లనొప్పులతో పాటు జలుబు, జ్వరంతో ఆసుపత్రికి వందల సంఖ్యలో వస్తున్నారు. ఓ వైపు జ్వర పీడితుల సంఖ్య పెరుగుతుండటం మరోవైపు సరిపడా బెడ్లు లేకపోవడం కొంత సమస్యగా మారింది. దీంతో కొందరికి రక్త పరీక్షలు నిర్వహించడం, మరికొందరికి మందులు ఇచ్చి పంపిస్తూ, రక్త పరీక్షలకు మరుసటి రోజు రావాలని సూచిస్తున్నారు.

## యువకుడి మృతదేహం లభ్యం



రాజేష్‌యాదవ్(ఫైల్)

జైపూర్, సెప్టెంబరు 10 (ఆంధ్ర జ్యోతి): పెద్దపల్లి జిల్లా గోదావరిఖని పట్టణంలోని అక్బర్‌నగర్‌కు చెందిన రాజేష్ యాదవ్ మృతదేహం లభ్యం అయినట్టు ఎస్సై శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల ఆరో తేదీన గణపతి నిమజ్జనంలో ప్రమాదవశాత్తూ ఇందారం గోదవరి బ్రిడ్జిపై నుంచి కాలుజారి గోదావరి నదిలో పడి గల్లంతయ్యాడు. బుధవారం రాజేష్‌యాదవ్ మృతదేహం లభించింది. మృతదేహం మండలంలోని శివ్వారం గోదావరి పరివాహక ప్రాంతం నది ఒడ్డున మృతదేహం కనిపించగా స్థానిక రైతులకు తమకు సమాచారం అందించారని తెలిపారు. దీంతో అక్కడకు వెళ్లి రాజేష్ యాదవ్ మృతదేహంగా గుర్తించామన్నారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై శ్రీధర్ తెలిపారు.

# వణికిస్తున్న వానరాలు.. పరుగులు పెట్టిస్తున్న శునకాలు..

● కూరగాయలు, పంట చేలు ధ్వంసం
● దాడులతో ఆసుపత్రులకు పరుగులు పెడుతున్న ప్రజలు

మంథనిరూరల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మంథనిలో కోతులు, కుక్కలతో ప్రజలు భయందోళనకు గురవుతున్నారు. కుక్కలు, కోతులు వీధులలో గుంపులు, గుంపులుగా తిరుగుతూ దాడులకు పాల్పడుతండటంతో ప్రజలు గాయాలకు గురై ఆసుపత్రుల పాలవుతున్నారు. మంథని



ఇళ్లల్లోకి వచ్చిన కోతులు

పట్టణంతోపాటు మండలంలోని అన్ని గ్రామాల్లో ఇదే పరిస్థితి. కోతుల కారణంగా ఇండ్ల పైకప్పులు, కూరగాయల మొక్కలు, పండ్ల చెట్లు దెబ్బతింటున్నాయని ప్రజలు వాపోతున్నారు. షాపుల్లోకి, ఇళ్లలోకి చొరబడి సామగ్రిని ఎత్తుకుపోతున్నాయి. అడ్డుకోవటానికి ప్రయత్నిస్తే దాడికి యత్నిస్తున్నాయని వాపోతున్నారు. కోతుల గుంపు వచ్చిందంటే కొన్ని గంటల పాటు నరకమేనని గ్రామస్థులు పేర్కొంటున్నారు. మరోవైపు కుక్కలు కూడా గుంపులు, గుంపులుగా తిరుగుతూ హల్‌చల్ చేస్తున్నాయి. కోతులు, కుక్కలు కారణంగా పాఠశాలల, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, పనుల కోసం బయటకు వెళ్లే మహిళలు, వృద్ధులు భయపడుతున్నారు. తమ వెంట కర్ర పట్టుకొని వెళ్లుతున్నారు. ఉదయం, సాయంత్రం వాకింగ్ చేసే వారు, క్రీడాకారులు మైదానానికి రావాలంటే జంకుతున్నారు. ఆగస్టు నెలలో మంథని ప్రభుత్వ ఆసుపత్రిలో కోతుల



మంథని వీధుల్లో గుంపులుగా సంచరిస్తున్న కుక్కలు

దాడిలో 156, కుక్కలదాడిలో 42మంది. ఈ నెలలో 52మంది కోతులు, కుక్కల దాడిలో గాయపడి చికిత్స పొందినట్లు వైద్యసిబ్బంది తెలిపారు. ఇప్పటికైనా మంథని మున్సిపాల్, అటవీశాఖ, గ్రామ పంచాయతీల అధికారులు స్పందించి వాటి నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## పుస్తెలతాడు చోరీ

జగిత్యాలరూరల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలంలోని పోరండ్ల గ్రామానికి చెందిన గొల్లపల్లి వెంకవ్వకు చెందిన రెండు తులాల పుస్తెల తాడును బుధవారం దొంగలు అపహరించుకొని వెళ్లినట్లు బాధితురాలు వెంకవ్వ తెలిపారు. మధ్యాహ్నం వెంకవ్వ మెడలో నుంచి ఇద్దరు ద్విచక్ర వాహనదారులు పుస్తెల తాడును లాక్కొని వెళ్లినట్లు తెలిపారు. బాధితురాలి కుమారుడు లింగయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

## వెంకట్రావుపల్లెలో కొనసాగుతున్న 144 సెక్షన్

ముస్తాబాద్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి):మండలంలోని వెంకట్రావుపల్లె గ్రామంలో 144 సెక్షన్ కొనసాగుతోందని ఎస్సై సీహెచ్ గణేశ్ తెలిపారు. ప్రభుత్వ స్థల విషయంలో ఓ వర్గానికి, గ్రామస్థులకు మధ్య జరుగుతున్న వివాదంతో కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆదేశాల మేరకు గ్రామంలో పోలీసులు బందో బందుబస్తు ఏర్పాటు చేశారు. ధర్నా చేసిన వారిపై కేసు నమోదు చేశామన్నారు.

# యూనివర్సిటీ అభివృద్ధే లక్ష్యం

● శాతవాహన ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఏర్పాటు
● విరాళాలు ప్రకటించిన ఎన్‌ఆర్‌ఐలు
● వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఉమేష్‌కుమార్

గణేశ్‌నగర్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): శాతవాహన యూనివర్సిటీ అభివృద్ధే లక్ష్యమని వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఉమేష్‌కూమార్ తెలిపారు. బుధవారం యూనివర్సిటీ సెమినర్ హాల్‌లో విలేకరులతో మాట్లాడుతూ అమెరికా పర్యటనలోని వివరాలను వెల్లడించారు. 2008లో స్థాపించిన యూనివర్సిటీ భిన్న కోర్సులు, నాలుగు పీజీ సెంటర్లతో తెలంగాణలోని ప్రముఖ విశ్వవిద్యాలయంగా పేరు తెచ్చుకునేందుకు ముందుకుసాగుతోందన్నారు. ఇందులో భాగంగా ఉపకులపతి శాతవాహన ఎడ్యుకేషన్ ట్రస్ట్ ఏర్పాటు చేశా మని, అమెరికా వెళ్లి అక్కడి నుంచి శిక్షణ, పరిశోధన, మెరుగైన అవకాశాల కోసం ఎన్నారైల నుంచి విరాళాలు సేకరించామన్నారు. సాంకేతిక అభివృద్ధి కోసం కంప్యూటర్లు, డిజిటల్ పరికరాలకు సహాయం చేశారన్నారు. పీజీ విద్యార్థుల స్నాతకోత్సవానికి బంగారు పతకాలను అందజేశారన్నారు. బోస్టన్ నగరంలో మీట్ అండ్ గ్రీట్ ద్వారా తెలంగాణ ఎన్నారై సంఘం బోస్టన్ చాప్టర్ రూ.3 లక్షల విరాళం ఇచ్చినట్లు చెప్పారు. డాక్టర్ దివాకర్ జాన్దియం, కోట సుమన్ రెడ్డి రూ.2లక్షల చొప్పున బంగారు పతకాలు అందజేశారన్నారు.



వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఉమేష్‌కుమార్

హూస్టన్ నగరంలో జితేందర్ రెడ్డి రూ.లక్ష, డాక్టర్ రాజశేఖర్ ఎలమంచిలి వెయ్యి డాలర్లు, అనురాధ, డాక్టర్ రమేష్ చర్విరాల రూ.2 లక్షల బంగారు పతకాన్ని అందజేశారని తెలిపారు. షార్లెట్‌లో కృష్ణ కాదరి రూ.లక్ష, దామోదర్ రెడ్డి రూ.50 వేలు ఇచ్చినట్లు చెప్పారు. ఫిలడెల్ఫియాలో కర్ర సుభాష్‌రెడ్డి రూ.2 లక్షల బంగారు పతకాన్ని అందజేశారని, న్యూయార్క్‌లో సుధాకర్‌రావు విదియాల హెచ్‌పీఎల్‌సీ పరికరం, రూ.2 లక్షల బంగారు పతకం, ఏటా కెమిస్ట్రీ విద్యార్థికి రూ.లక్ష నగదు బహుమతి, హైదరాబాద్ ప్లాంట్‌లో ఐదుగురు విద్యార్థులకు ఇంటర్నెట్ షిప్ సదుపాయాలు కల్పించారన్నారు. న్యూ జెర్సీలో డాక్టర్ బండారి సుధాకర్ 10 కంప్యూటర్లను, ప్రదీప్ సువర్ణ రూ.2 లక్షల బంగారు పతకం, డాక్టర్ మనోహర్ శ్రీరామోజి రూ.2లక్షల బంగారు పతకం ఐదు సంవత్సరాల వరకు అందజేస్తామన్నారని తెలిపారు. డాక్టర్ కిషోర్ భూపతి రూ.2 లక్షల, శరత్‌రెడ్డి రూ.2 లక్షల బంగారు పతకాలు అందజేశారన్నారు. వాషింగ్టన్ డీసీలో జనేత రెడ్డి రూ.2 లక్షల బంగారు పతకం లా విద్యార్థుల కోసం అందజేసినట్లు చెప్పారు. నవంబరు రెండో వారంలో విశ్వవిద్యాలయంలో రెండోసారి స్నాతకోత్సవాలను నిర్వహిస్తామని, ఇందులో విద్యార్థులకు బంగారు పతకాలు, నగదు బహుమతులు అందజేస్తామని తెలిపారు. ఎన్నారైల సహకారంతో శాతవాహన విశ్వవిద్యాలయాన్ని తెలంగాణలోనే మొదటి వరుసలో నిలపడానికి ప్రయత్నం చేస్తామని,వారికి కృతజ్ఞతలు తెలుపుతున్నామని అన్నారు.

## వృద్ధురాలి ఫిర్యాదుపై విచారణ చేపట్టిన అధికారులు

ఇల్లందకుంట, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బోగంపాడు గ్రామానికి చెందిన కల్లెం అమృతమ్మ ఫిర్యాదుపై అధికారులు బుధవారం విచారించారు. అమృతమ్మ భర్త చిన్న రాజిరెడ్డి పదేళ్ల క్రితం మృతి చెందాడు. భర్త మృతి చెందిన తర్వాత కొడుకులిద్దరూ తిరుపతిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి నుంచి ఎలాంటి జీవనభృతి లేకపోవడం వల్ల ఎడ్ల దొడ్డిలో జీవనం సాగిస్తున్నారు. కొడుకులు తనను పట్టించుకోవడం లేదని అమృతమ్మ ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. కలెక్టర్, ఆర్డీవో ఆదేశాల మేరకు గిర్దావర్ నాగరాజు, కానిస్టేబుల్ రాజేష్, మహిళ శిశు సంక్షేమ శాఖ సూపర్‌వైజర్ జ్యోతి, సఖి కౌన్సిలర్ పద్మావతి, డీహెచ్‌హెడ్ జెండర్ స్పెషలిస్టు కవితలు బోగంపాడు గ్రామంలోని అమృతమ్మ ఉంటున్న గుడిసెను సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కొడుకులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. అధికారులు పూర్తి నివేదికను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతికి అందించనున్నట్లు తెలిపారు.



అమృతమ్మను వివరాలు అడిగి తెలుసుకుంటున్న అధికారులు

## గర్షకుర్తి మరమగ్గాలపై విజిలెన్స్ తనిఖీలు

గంగాధర, సెప్టెంబరు 110 (ఆంధ్రజ్యోతి) : గంగాధర మండలం గర్షకుర్తి పవర్ లూమ్స్‌పై బుధవారం విజిలెన్స్ అధికారులు దాడీ చేశారు. జిల్లా విజిలెన్స్ ఎన్‌ఫోర్స్ మెంటు ఏడీ అనిత ఆధ్వర్యంలో చెన్నయ్‌కి చెందిన అధికారుల బృందం దాడీ చేశారు. మర మగ్గాలపై కలర్ చీరలు తయారు చేస్తున్న గర్షకుర్తికి చెందిన మిట్టపల్లి వెంకటేశ్ మగ్గాలపై దాడులు చేసి కేసు నమోదు చేసి, దూస వెంకటేశ్‌ల మరగ్గాలపై దాడులు చేసి రంగుల చీరలు తయారు చేస్తుండగా కోసివేశారు. పాత జీవో ప్రకారం కలర్ చీరలు తయారు చేయవద్దని ఆర్డర్లు ఉన్నప్పటికీ కార్మికులు వాటిని తయారు చేస్తుండగా కేసులు నమోదు చేసినట్లు విజిలెన్స్ అధికారులు తెలిపారు. గ్రామంలో మగ్గాలను పరిశీలిస్తూ కలర్ చీరల తయారీ కార్మికులను బెంబేలెత్తించారు.



మగ్గాలను పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

## కిడ్నాప్ కేసులో నిందితుల అరెస్టు

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లిలోని మైత్రి హోటల్ వద్ద ఈ నెల 7న సాయంత్రం డబ్బుల విషయంలో నిష్టూరి యశ్వంత్, ముద్దుల మధును కారులో కిడ్నాప్ చేసి, బెదిరించి డబ్బులు తీసుకున్న కేసులో నిందితులను బుధవారం అరెస్టు చేశామని కొత్తపల్లి పోలీసులు తెలిపారు. ఈ కేసులో నల్లపాటి నరేష్, గుడిమల్ల సివిల్, తునికిపాటి శేఖర్, ఆలకుంట ఉపేందర్, ఆలకుంట అశోక్‌ను అరెస్టు చేశామని పేర్కొన్నారు. రెండు కార్లు, ఐదు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ కేసుతో సంబంధమున్న మరికొందరి కోసం గాలిస్తున్నట్లు పేర్కొన్నారు.

## గణేష్ చందా ఇవ్వలేదని కుల బహిష్కరణ

● పోలీసులకు బాధితుల ఫిర్యాదు

జగిత్యాలరూరల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా జగిత్యాల రూరల్ మండలం కల్లెడ గ్రామంలో గణేష్ చందా ఇవ్వలేదని కుల బహిష్కరణ చేశారని బాధితులు బుధవారం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కల్లెడ గ్రామంలో గణేష్ నవరాత్రులకు సంబంధించిన చందా ఇవ్వకపోవడంతో తమ నాలుగు కుటుంబాలను కులం నుంచి వెలివేశారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. తమ కుటుంబాలతో ఎవరూ మాట్లాడకూడదని షరతులు విధించారన్నారు. ఎవరైనా మాట్లాడితే రూ.25 వేల జరిమానా విధిస్తామని కుల పెద్దలు హెచ్చరించినట్లు బాధితులు పేర్కొన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు 10 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సధాకర్ తెలిపారు.

## హైనా దాడిలో శునకం మృతి

మల్యాల, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): మల్యాల శివారులోని వ్యవసాయ మార్కెట్ ఆవరణలో గల సివిల్ సప్లై గోదాం వద్ద వన్యప్రాణి హైనా దాడిలో శునకం మృతి చెందింది. బుధవారం గోదాంల వద్ద శునకం మృతి చెందడాన్ని గోదాం సిబ్బంది గమనించి అటవీ అధికారులకు సమాచారం అందించారు. మంగళవారం అర్ధరాత్రి వన్యప్రాణి ఈ ప్రాంతంలో సంచిరించినట్లు ఇక్కడ లభించిన ఆనవాళ్ల మేరకు హైనాగా అటవీ అధికారులు అనుమానిస్తున్నారు. హైనా సంచారం స్థానికులను ఆందోళనకు గురి చేస్తోంది.

## సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు పెట్టిన వారిపై కేసు నమోదు

వీణవంక,సెప్టెంబరు10(ఆంధ్రజ్యోతి): మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎక్కటి రఘుపాల్ రెడ్డిపై ఆధారాలు లేకుండా సోషల్ మీడియా వాట్సాప్ గ్రూపులలో అనుచిత వాక్యలు చేస్తూ బీఆర్ఎస్ నాయకులు పోస్టులు పెట్టడంతో మండల సోషల్ మీడియా కో ఆర్డినేటర్ బావు రాకేష్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎలాంటి ఆధారాలు లేకుండా రెండు పార్టీల మధ్య గొడవలు జరిగేలా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన బీఆర్ఎస్ నాయకులు కామిడి శ్రీనివాస్ రెడ్డి,బండా కిషన్ రెడ్డి,ఖుర్షుల చరణ్ రావులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఆవుల తిరుపతి తెలిపారు. ఎవరైనా సోషల్ మీడియాలో ఇతరులకు భంగం కలిగేలా శాంతిభద్రతలకు ఇబ్బంది కలిగేలా పోస్టులు పెడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## మద్యం సేవించి వాహనం నడిపిన వారితో సామాజిక సేవ

● ఆస్పత్రిలో పండ్లు .. విద్యార్థులకు నోట్‌బుక్‌ల పంపిణీ
● గోదావరిఖని కోర్టు ఆదేశాలు

కోల్‌సిటీ, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మద్యంసేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారిలో పరివర్తన తీసుకువచ్చేందుకు గోదావరిఖని కోర్టు జరిమానాలతో పాటు సామాజిక సేవ చేయాలనే ఆదేశాలనిచ్చింది. బుధవారం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వెంకట్ సచిన్‌రెడ్డి అంతర్గాం, ఎన్‌టీపీసీ పోలీస్ స్టేషన్ పరిధిలో పట్టుబడిన 8మంది మందు బాబులకు ఒక్కొక్కరికి రూ.2వేల నుంచి రూ.4వేల జరిమానా విధించడంతో పాటు సామాజిక సేవలను శిక్షలుగా విధించారు. జడ్జి ఆదేశాల మేరకు కోర్టు కానిస్టేబుళ్లు రవికుమార్, బుర్ర శ్రీనివాస్ శిక్షలు అమలు చేయించారు.

ప్రభుత్వాసుపత్రి, పాఠశాల ఆవరణలను శుభ్రం చేయడం, ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ, విద్యా ర్థులకు నోట్ పుస్తకాల పంపిణీతో పాటు గాంధీనగర్‌లోని ఇందిరమ్మ సర్కిల్ వద్ద మద్యం సేవించి వాహనాలు నడిపితే జరిమానాతో పాటు జైలు శిక్ష తప్పదని ప్లకార్డులు ప్రదర్శిస్తూ ట్రాఫిక్ విధులు నిర్వహించారు.



మద్యం సేవించి వాహనాలు నడుపవద్దని ప్లకార్డులు ప్రదర్శిస్తున్న యువకులు

## చెరువులో పడి వృద్ధురాలు మృతి

గంభీరావుపేట, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : గంభీరావుపేట నమాజ్ చెరువులో మారవేణి మల్లవ్వ(68) అనే వృద్ధురాలు పడి మృతిచెందింది. మంగళవారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్లిన మల్లవ్వ సమీప నమాజ్ చెరువులో అదేరోజు రాత్రి శవమై కనిపించింది. మల్లవ్వకు మానసిక పరిస్థితి బాగాలేకనే చెరువులో పడి చనిపోయిందని మృతురాలు బంధువులు ఫిర్యాదు చేశారు. మంగళవారం సాయంత్రం 5 గంటలకు మల్లవ్వ ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. ఎంత వెతికినా మల్లవ్వ దొరకలేదు. అదేరోజు రాత్రి 10 గంటల ప్రాంతంలో సమీప నమాజ్ చెరువులో మల్లవ్వ శవమై కన్పించింది. మానసిక పరిస్థితి బాగాలేకనే మల్లవ్వ చెరువులో పడి ఊపిరి ఆడక చనిపోయిందని మృతురాలు కొడుకు సాయిలు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అనిల్ కుమార్ తెలిపారు.

# కాళేశ్వరం ప్రాజెక్టులో లక్షా 15 వేల కోట్లు దోచుకున్న కేసీఆర్

● టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గజ్జెల కాంతం

కరీంనగర్ అర్బన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణానికి లక్షా 50 వేల కోట్లు ఖర్చయినట్లు కేసీఆర్ చెప్పారని, వాస్తవంగా 35 వేల కోట్లు ఖర్చవగా మిగతా లక్షా 15 వేల కోట్లు కేసీఆర్ కుటుంబం దోచుకుందని టీపీసీసీ ప్రధానకార్యదర్శి గజ్జెల కాంతం అన్నారు. కరీంనగర్ డీసీసీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టు కడితే కోటి 40 లక్షల ఎకరాలకు నీళ్ల వస్తాయని, రక్తం దారపోసి కర్త, కర్మ, క్రియ, ఇంజనీరుగా అన్ని తానై కట్టినట్లు చెప్పారని అన్నారు. ప్రాజెక్టు అవినీతి, అక్రమాలపై జస్టిస్ ఘోష్ కమిషన్ చేసిన విచారణ అనంతరం నివేదికలో వాస్తవాలు బయటపడ్డాయన్నారు. జస్టిస్ ఘోష్ కమిషన్ నివేదికను సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో అన్ని పార్టీల ఎమ్మెల్యేలకు అందజేశారన్నారు. లక్ష 15 వేల కోట్లు అవినీతి జరిగిందని, కానీ ఇందులో తనకు ఎలాంటి సంబంధమూ లేదని, ప్రాజెక్టు నిర్మాణ బాధ్యత మొత్తం కేసీఆర్ తీసుకున్నారని నాటి ఇరిగేషన్ మంత్రి హరీష్‌రావు ఘోష్ కమిషన్‌కు స్పష్టం చేస్తూ లిఖితపూర్వకంగా రాసిచ్చారన్నారు. ఈ నివేదికను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసెంబ్లీ సాక్షిగా తీర్మానం చేసి సీబీఐ విచారణ కోరుతూ కేంద్ర ప్రభుత్వానికి అందజేశారన్నారు. కేసీఆర్ దోచుకున్న లక్ష 15 వేల కోట్ల రూపాయలు తెలంగాణ ప్రజల కష్టార్జితమన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగింది వాస్తవమని, కానీ ఆ అవినీతిని చేసింది మాత్రం నాడు ఇరిగేషన్ మంత్రిగా ఉన్న హరీష్‌రావు మాత్రమేనని స్వయంగా కేసీఆర్ కూతురు కవిత చెప్పారని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో ఇసుక వ్యాపారం చేసిన సంతోష్‌రావు అందులో వేల కోట్లు దోచుకున్నారని కవిత చెప్పిన మాట వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. హరితహారం పేరుతో సంతోష్‌రావు వేలకోట్ల అవినీతికి పాల్పడ్డారని ఇటీవల కవిత బహిరంగంగా చెప్పారన్నారు. కేసీఆర్ కూతురు కవిత స్వయంగా కాళేశ్వరంలో అవినీతి జరిగిందని చెబుతుంటే కేటీఆర్ సిగ్గు లేకుండా సీఎం రేవంత్‌రెడ్డి మీద అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిపై కేటీఆర్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ ఫార్ములావన్ కేసులో అవినీతికి పాల్పడి అడ్డంగా దొరికిన కేటీఆర్ ఇప్పుడు దానిపై లొట్ట పీసు కేసు అంటూ పిచ్చి వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. నేరెళ్లలో ఇసుక మాఫియాపై ప్రశ్నించినందకు థర్డ్ డిగ్రీ ప్రయోగించి ఏ పని చేసుకోని విధంగా కొట్టి వారి జీవితాలను నాశనం చేశారని స్వయంగా కవిత చెప్పారన్నారు. కేటీఆర్, హరీష్‌రావు, కవిత కోట్ల రూపాయలతో భవనాలు, ఫాంహౌస్‌లు నిర్మించుకున్నారని, కేసీఆర్ 60 ఎకరాలలో ఉన్న ఫామ్ హౌస్ నేడు 600 ఎకరాలు అయ్యిందని అన్నారు. కేటీఆర్, హరీష్‌రావు, కవిత అమెరికా, దుబాయ్, సింగపూర్‌లలో వేల కోట్లు పెట్టుబడులకు డబ్బు ఎలా వచ్చిందో చెప్పాలన్నారు. ఆస్తుల పంపకాల్లో గొడవలతోనే కవిత ఇదంతా బయట పెట్టారన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో హైదరాబాద్‌లో నిజాం వారసులకు చెందిన 30 వేల ఎకరాల భూమిని కేటీఆర్, హరీష్‌రావు, సంతోష్‌రావు, కవిత కబ్జా చేశారని, దీని కోసమే ధరణి తీసుకొచ్చారని అన్నారు. నిజాంకాలంలో నిర్మించిన సచివాలయం పునర్నిర్మాణంలో భాగంగా జరిపిన తవ్వకాల్లో బంగారం, పచ్చ రంగు వజ్రాలు బయటపడ్డాయని, వాటిని సమానంగా పంచాలని కవిత డిమాండ్ చేయడంతో ఆ కుటుంబంలో గొడవలు వచ్చాయని అన్నారు. రాష్ట్రం వస్తే ఉద్యోగాలు వస్తాయని యువకులు ఉద్యమాలు చేసి ప్రాణత్యాగాలు చేస్తే, చలించిపోయిన సోనియాగాంధీ తెలంగాణ ఇచ్చారని, కేసీఆర్ సీఎం అయ్యాక వారి ఇంట్లో నలుగురికి ఉద్యోగాలు వచ్చాయన్నారు. ఈ నలుగురి ఉద్యోగాల తరువాత తెలంగాణ రూ.8 లక్షల కోట్ల అప్పుల పాలయ్యిందన్నారు. విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నాయకులు సముద్రాల అజయ్, కల్వల ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.




విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న గజ్జెల కాంతం

## పురోహితుడు అదృశ్యం

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లి, రాచర్లబొప్పాపూర్‌లోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో పురోహితుడిగా కొనసాగుతున్న ఉత్తరప్రదేశ్‌కు చెందిన తివారి శైలేందర్ అదృశ్యంపై కేసు నమోదు చేశామని ఎస్ఐ రాహుల్‌రెడ్డి బుధవారం పేర్కొన్నారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన శైలేందర్ తన కుటుంబ సభ్యులతో కలిసి గ్రామంలోని ఓ గది అద్దెకు తీసుకుని స్థానిక ఆలయంలో పురోహితుడిగా కొనసాగుతున్నాడని తెలిపారు. మధ్యాహ్నం ఇంటి నుంచి ముస్తాబాద్ మండలం కొండాపూర్ గ్రామంలోని నారోజు రాజు బైక్‌పై వెళుతున్న క్రమంలో శైలేందర్ భార్య శైలతో పాటు కుటుంబ సభ్యులు అడ్డుకునేందుకు యత్నించారని చెప్పారు. వారి ద్విచక్రవాహనాన్ని వెంబడించి అతని స్నేహితులతో మాట్లాడుతున్న తరుణంలో శైలేందర్ అక్కడ నుంచి వెళ్లిపోయాడని పేర్కొన్నారు. రాత్రి అయినా ఇంటికి తిరిగి రాకపోవడంతో పాటు సెల్‌ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి ఉండడంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు ఆరా తీశారని తెలిపారు. ఆచూకీ లభించలేదని పేర్కొన్నారు. తన భర్త కనిపించకపోవడానికి కొండాపూర్ వాసి నారోజు రాజుపై అనుమానం ఉందని పేర్కొంటూ శైలేందర్ భార్య శైల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ రాహుల్‌రెడ్డి వివరించారు.

## వివాహిత మృతికి కారణమైన అత్త, బావలపై కేసు

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు10(ఆంధ్రజ్యోతి) : వివాహిత ఆత్మహత్యకు కారణమైన సంఘటనలో ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్‌లోని మృతురాలు అత్త ఈరవేణి లక్ష్మి, బావ సత్యనారాయణలపై కేసు నమోదు చేశామని ఎస్ఐ రాహుల్‌రెడ్డి బుధవారం తెలిపారు. గ్రామంలోని వివాహిత ఈరవేణి రమ్య తన అత్త లక్ష్మి, బావ సత్యనారాయణలు మానసికంగా వేధించడంతో మనస్థాపం చెంది ఈనెల 9న ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిందని పేర్కొన్నారు. మృతురాలి తల్లి భాగ్యలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ రాహుల్‌రెడ్డి వివరించారు.

## ఎల్లంపల్లికి.. బీఆర్ఎస్‌కు ఏం సంబంధం?

● చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

హైదరాబాద్ సెప్టెంబర్10 ,(ఆంధ్రజ్యోతి): ఎల్లంపల్లి ప్రాజెక్టును తామే నిర్మించినట్లుగా బీఆర్ఎస్ నాయకులు తెగ ఊదర గొడుతున్నారని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం విమర్శించారు. అసలు ఎల్లంపల్లి ప్రాజెక్టునకు బీఆర్ఎస్‌కు ఏం సంబంధం అని ఆయన ప్రశ్నించారు. బుధవారం సీఎల్పీ మీడియా సెంటర్‌లో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం విలేకరులతో మాట్లాడుతూ ఎల్లంపల్లి కాంగ్రెస్ పార్టీ మానస పుత్రికగా అభివర్ణించారు. కాంగ్రెస్ పార్టీ హయాంలోనే ఎల్లంపల్లి ప్రాజెక్టునకు శంకుస్థాపన జరిగిందని, పనులు సైతం పూర్తి చేసినట్లు ఆయన స్పష్టం చేశారు. అయితే ఎల్లంపల్లి ప్రాజెక్టును తామేనిర్మించామన్నట్లుగా బీఆర్ఎస్‌కు చెందిన మాజీ మంత్రి హరీ‌ష్‌రావు తెగ ఊదరగొడుతున్నారని విమర్శించారు. ఎల్లంపల్లి ప్రాజెక్టును ప్రారంభించిన పక్షంలో కాంగ్రెస్‌కు మంచి పేరు వస్తుందన్న భయంతో ఇప్పటి వరకు అధికారికంగా ప్రారంభోత్సం చేయలేదన్నారు. ఒక వేళ ఎల్లంపల్లిని పూర్తి చేసిన పక్షంలో కేసీఆర్ ఎందుకు ప్రారంభించలేదని నిలదీశారు. ఈ ప్రాజెక్టుతో పెద్దపల్లి, కరీంనగర్, సిరిసిల్ల, జగిత్యాల, భూపాలపల్లి, మంచిర్యాల ప్రాంతాల్లోని 2.24 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. అలాగే సింగరేణి, సింగరేణి విద్యుత్ సంస్థలకు ఇక్కడినుంచే నీటిని సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. అబ్దుల్ కలాం సుజల స్రవంతి కింద 10 టీఎంసీలు గ్రేటర్ హైదరాబాద్‌కు పైప్‌లైన్‌ల ద్వారా తాగు నీటికోసం పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

## లక్ష ఉద్యోగాలకు కట్టుబడిన కాంగ్రెస్ సర్కార్

● ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్

హైదరాబాద్ సెప్టెంబర్ 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష మందికి ఉద్యోగాలు ఇస్తామన్న మాటకు కట్టుబడి ఉందని అందుకు అనుగుణంగా చర్యలు తీసుకుంటుందని కాంగ్రెస్ శాసనసభ్యుడు మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ స్పష్టం చేశారు. టీజీపీఎస్సీపై హైకోర్ట్ తీర్పులో కాంగ్రెస్ పార్టీని కానీ ప్రభుత్వాన్ని ఎక్కడ ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదని, ఎలాంటి అవకతవకలు జరగలేదని పేర్కొన్నారు. బుధవారం గాంధీభవన్‌లో మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ విలేకరులతో మాట్లాడుతూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడికౌశిక్ రెడ్డి నిరుద్యోగ యువతను రెచ్చగొట్టే విధంగా మాట్లాడుతున్నారని విమర్శించారు. రాష్ట్రంలో యువతకు బతుకులను చీకట్లో నెట్టింది మీ పార్టీ, మీ నేత కేటీఆర్ కాదా. అని ప్రశ్నించారు. అవాకులు చెవాకులు పేలితే మాటలతో కాదు... చేతలతో చూపించాల్సి వస్తుందని మక్కాన్ సింగ్ ఠాకూర్ హెచ్చరించారు. రేవంత్‌రెడ్డి యువత భవిష్యత్తుకు భరోసా అని స్పష్టం చేశారు. నిరుద్యోగులు బీఆర్ఎస్ నాయకుల రెచ్చగొట్టే మాటలు నమ్మవద్దని కోరారు. యువత ఆందోళన చెందాల్సిన అవసరం లేదని , ఏ విద్యార్థికి నష్టం జరగకుండా ప్రభుత్వం తగిన జాగ్రత్తలు తీసుకుంటుందన్నారు.

## ఏడుగురి బైండోవర్

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఇటీవల గణేష్ నిమజ్జనం సందర్భంగా మద్యం మత్తులో న్యూసెన్స్ చేసిన ఏడుగురు యువకులను బైండోవర్ చేశామని కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. కరీంనగర్ రూరల్ మండలం చెర్లబూత్కూర్‌కు చెందిన పైండ్ల అజయ్, తిరుపతి, స్వామి, సాయి కేశవ్, రాజేందర్, కుమార్, శ్రీనును బుధవారం స్థానిక తహసీల్దార్ ఎదుట హాజరుపరిచినట్లు పేర్కొన్నారు.

● త్వరలో అద్దె భవనంలోకి మారనున్న నాలుగు కోర్టులు
● రాజన్న సిరిసిల్ల జిల్లాలో జీప్లస్ 4 అంతస్థులు.. 12 కోర్టులకు రూపకల్పన
● రూ.81.26కోట్లు కేటాయించిన రాష్ట్ర ప్రభుత్వం




# 'న్యాయ నిర్మాణ్ భవన్'కు శ్రీకారం



సిరిసిల్ల క్రైం, సెప్టెంబర్ 10(ఆంధ్రజ్యోతి): కక్షిదారుల సంఖ్య పెరుగుతున్న క్రమంలో జిల్లా కోర్టు మోడల్ భవనం నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుడుతోంది. సిరిసిల్ల పట్టణంలో 5.1ఎకరాల స్థలంలో జిల్లా కోర్టు భవన సముదాయాన్ని నిర్మించడానికి ప్లాన్ సిద్ధమైంది.ఇందులో భాగంగానే రోడ్డు, భవనాల శాఖ ఇంజనీరింగ్ అధికారులు హైకోర్టు ఆదేశాల మేరకు జిప్లస్4 అంతస్తులతో 12కోర్టుల నిర్మాణానికి రూపకల్పన చేశారు. భవన నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ. 81.26కోట్లు కేటాయించింది. నూతన కోర్టు భవన సముదాయం నిర్మాణ పనులు ఈనెలాఖరులోగా చేపట్టేందుకు ముహూర్తం ఖరారైంది.

● నేలమట్టం కానున్న పాత భవనం

పాత తాలుకా కేంద్రమైన సిరిసిల్ల పట్టణంలో 1973లో మున్సిఫ్‌కోర్టును ప్రారంభించారు. 52సంవత్సరాల క్రితం పక్కా భవనంలో ఏర్పాటుచేసిన మున్సిఫ్ కోర్టు పాత భవనం నేలమట్టం కానుంది. రాజన్న సిరిసిల్ల జిల్లాగా రూపాంతరం చెందిన తర్వాత సిరిసిల్లకు జిల్లా కోర్టు, 1వ అదనపు సెషన్స్ జిల్లా కోర్టుతో పాటు పోక్సో కోర్టు, అదనపు జూనియర్ సివిల్ జడ్జి, 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులు మంజూరయ్యాయి.ఈవిధంగా కోర్టుల సంఖ్య పెరగడంతో పాత భవనాలు సరిపోవడంలేదు. దీంతో ప్రభుత్వం జిల్లా కోర్టుసమీకృత భవన సముదాయం నిర్మాణానికి శ్రీకారం చుట్టింది.

● అధునాతనంగా 'న్యాయ నిర్మాణ్ భవన్'

జిల్లాకేంద్రంలో అధునాతన పద్ధతిలో 'న్యాయ నిర్మాణ్ భవన్' సముదాయం నిర్మాణానికి సిద్ధం చేశారు. జీప్లస్4 విధానంలో భవన సముదాయాన్ని నిర్మించడానికి రూపకల్పన చేశారు. భవిష్యత్తులోనూ మరో రెండు అంతస్తులు నిర్మించేలా ప్రణాళిక సిద్ధం చేశారు. ఇందులో 12 కోర్టు హాళ్లు, ఆఫీసర్స్ చాంబర్స్, ప్రతి ఫోర్‌లో బార్ అసోసియేషన్ హాలు, టాయిలెట్స్, కక్షిదారుల చాంబర్, విజిటర్స్ చాంబర్‌లను మోడల్ విధానంలో నిర్మించడానికి రూపొందించారు. ప్రతి ఫ్లోర్‌కు వెళ్లేందుకు కక్షిదారులకు ఒక లిఫ్ట్, న్యాయ వాదికారులకు ఒక లిఫ్ట్ ఏర్పాటు చేయనున్నారు. గ్రౌండుఫ్లోర్‌లో పూర్తిస్థాయిలో 88 కార్లు, 62బైక్‌లు పార్కింగ్ సౌకర్యం కల్పించడానికి నిర్ణయించారు. ఇందులో ప్రస్తుతం ఉన్న జిల్లా కోర్టు, 1వ అడిషనల్ సెషన్స్ జిల్లా కోర్టు, పోక్సో కోర్టు, ఫ్యామిలీ కోర్టు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టు, 1వ అదనపు జూనియర్ సివిల్ కోర్టు, 2వ అదనపు జూనియర్ సివిల్ కోర్టులతోపాటు భవిష్యత్తులో మంజూరయ్యే మరో ఆరు కోర్టులు ఏర్పాటు చేసుకునేందుకు వీలుగా న్యా యనిర్మాణ్ భవనాన్ని నిర్మించడానికి టెండర్ ప్రక్రి య పూర్తయింది. ఈ టెండర్‌ను కెఎంవిఆర్ కంపెనీ దక్కించుకొని 24నెలల్లో పూర్తిచేయడానికి అగ్రిమెంట్ చేసుకొంది.

### ● ఈనెల 15న అద్దెభవనంలోకి కోర్టులు..


తాత్కాలికంగా ఏర్పాటుకానున్న అద్దె బిల్డింగ్

నూతన కోర్టు సమీకృత భవనం నిర్మాణానికి శంకుస్థాపన చేయనుండడంతో ఈనెల 15న అద్దె భవనంలోకి మారనున్నాయి. మంగళవారం ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను జిల్లా ప్రధాన న్యాయ మూర్తి జారీ చేశారు. సిరిసిల్ల పట్టణంలోని సర్దార్‌నగర్‌లో గల ఓ భవనంలోకి మూడు కోర్టుల వ్యవహారాలు సాగుతాయి. ఇందులో పీడీఎం, ఏడీఎం, 2వ ఏడీఎం కోర్టులు ఉంటాయి. సిరిసిల్ల పట్టణంలోని సాయినగర్‌లో అద్దె భవనంలోకి సీనియర్ సివిల్ కోర్టు మారుతోంది. మిగతా జిల్లా కోర్టు, 1వ అడిషనల్ సెషన్స్ జిల్లా కోర్టు, పోక్సో కోర్టులు ప్రస్తుతం ఉన్న బార్ అసోసియేషన్ హాలులోనే కొనసాగుతాయి.

### అద్దె భవనంలోకి నాలుగు కోర్టులు..

- పీ. నీరజ, జిల్లా ప్రధాన న్యాయమూర్తి, రాజన్న సిరిసిల్ల జిల్లా



రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో అధునాతన పద్ధతులతో నూతన కోర్టు భవనం నిర్మాణానికి ముహూర్తం చేయనున్న నేపథ్యంలో ప్రస్తుతం ఉన్న నాలుగు కోర్టులు అద్దె భవనంలోకి మార్చుతాం. సువిశాలమైన స్థలంలో నిర్మించే ఈ భవనం నిర్మాణానికి త్వరలో శ్రీకారం చుట్టేందుకు హైకోర్టు రూపకల్పన చేసింది.

### నూతన భవన నిర్మాణానికి సిద్ధం..

- జూపల్లి శ్రీనివాసరావు, అధ్యక్షుడు, బార్ అసోసియేషన్, సిరిసిల్ల



జిల్లా కేంద్రంలో నూతన సమీకృత కోర్టు భవన నిర్మాణానికి సిద్ధం కావడం శుభపరిణామం. ఈ కోర్టు భవనం నిర్మాణానికి పలువురు హైకోర్టు న్యాయ మూర్తులను ఆహ్వానించేందుకు హైకోర్టుకు వెళ్లి వచ్చాం. ఈనెలాఖరులోగా నూతన కోర్టు భవనానికి శంకుస్థాపన కానుంది.

## అరుణాచల యాత్రకు సూపర్ లగ్జరీ బస్సు

భగత్‌నగర్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ నుంచి అరుణాచలానికి సూపర్ లగ్జరీ బస్సు నడిపిస్తున్నట్లు కరీంనగర్-1 డిపో మేనేజర్ విజయమాధురి ఒక ప్రకటనలో తెలిపారు. భాద్రపదశుద్ధ పౌర్ణమితో పాటు తీర్థయాత్రల టూర్‌లో భాగంగా ఈ నెల 13వ తేదీ సాయంత్రం 4 గంటలకు కరీంనగర్ బస్టాండ్ నుంచి బస్సు బయల్దేరుతుందని పేర్కొన్నారు. 14న కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ అదే రోజు అరుణాలచం చేరుకుంటుందని తెలిపారు. గిరి ప్రదక్షిణ, దర్శనం అనంతరం 15వ తేదీ మధ్యాహ్నం బస్సు బయల్దేరి జోగులాంబ దర్శనం అనంతరం కరీంనగర్ చేరుకుంటుందని పేర్కొ న్నారు. పెద్దలకు రూ.4700, పిల్లలకు రూ.3540 చొప్పున ఛార్జీలు నిర్ణయించినట్లు తెలిపారు. ఇతర వివరాలకు 7382849352, 9959225920, 8074690491 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

## రూ.7,450 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, సెప్టెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7450 పలికింది. బుధవారం మార్కెట్ యార్డుకు నలుగురు రైతులు 82క్వింటాళ్ల విడి పత్తి, ఒక రైతు గోనె సంచుల్లో క్వింటాల్ పత్తి విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర రూ.7450 చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

## ద్విచక్రవాహనాలు ఢీకొని ఇద్దరికి గాయాలు

మానకొండూర్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గట్టుదుద్దెనపల్లి గ్రామ శివారులో బుధవారం రాత్రి రెండు మోటారు సైకిళ్లు ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. గట్టుదుద్దెనపల్లి గ్రామానికి చెందిన టప్ప వెంకటేశం(27) తన మోటార్ సైకిల్‌పై చెంజర్లకు వెళ్తున్నాడు. చెంజర్ల వద్ద మాలోతు శ్రీనివాస్ (37) మోటారు సైకిల్‌పై వెళ్తుండగా ఎదురుగా ఢీకొన్నాయి. ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు కాగా 108 వాహనం ద్వారా కరీంనగర్‌కు తరలించారు.

# ముదిరాజ్‌లకు సముచిత హక్కులు కల్పించాలి


మాట్లాడుతున్న ముదిరాజ్ మహాసభ నేత నీలం మధుముదిరాజ్


హాజరైన ముదిరాజ్ కులస్తులు

గణేశ్‌నగర్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ముదిరాజ్‌లకు సముచిత హక్కులు కల్పించాలని, బీసీడీ నుంచి బీసీఏలో చేర్చాలని తెలంగాణ ముదిరాజ్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు నీలం మధు మదిరాజ్ అన్నారు. బుధవారం కరీంనగర్‌లోని పద్మనాయక కల్యాణ మండపంలో టీఎంపీఎస్ ముదిరాజ్ పోరాట సమితి ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 15న నిజామాబాద్‌లో నిర్వహించనున్న సభలో సీఎం, రేవంత్‌రెడ్డి ముదిరాజ్‌ల బీసీ-ఏలో చేర్చడంపై ప్రకటన చేస్తారని ఆశిస్తున్నామన్నారు. ముదిరాజ్‌లు అందరూ ఏకతా టిపై ఉన్నారని, స్థానిక ఎన్నికల్లో జిల్లాకు 30 మంది సర్పంచులను గెలిపించుకుంటామని అన్నారు. గత ప్రభుత్వం ముదిరాజ్‌లను నిర్లక్ష్యం చేసిందన్నారు. సీనియర్ నాయకులు మంద నగేష్ ముదిరాజ్, సుంకరబోయిన మహేష్ ముదిరాజ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉప్పరవేణి రంజిత్ ముదిరాజ్, సమితి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు మహేందర్ ముదిరాజ్, జిల్లా ప్రధాన కార్యదర్శి కీసర సంపత్ ముదిరాజ్, జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు పిట్టల రవీందర్ ముదిరాజ్, వైస్ ఛైర్మన్ కుమార స్వామి ముదిరాజ్, జిల్లా ఉపాధ్యక్షులు మామిడి తిరుపతి ముదిరాజ్, పురం రాజేష్ ముదిరాజ్, నిమ్మల కిషన్ ముదిరాజ్, ఎరవేణి రామాంజనేయులు ముదిరాజ్, జిల్లా కార్యదర్శి బాలెన్కి మల్లేష్ ముదిరాజ్, గట్టు శ్రీధర్ ముదిరాజ్, జిల్లా అధికార ప్రతినిధులు మౌటం సంపత్ ముదిరాజ్, పిల్లి రవి ముదిరాజ్, బోయిని వెంకటేష్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ఖజానాను ఖాళీ చేసిన కల్వకుంట్ల కుటుంబం

● అవగాహన లేకుండా మాట్లాడుతున్న కేటీఆర్ ● మంత్రి గడ్డం వివేక్‌వెంకటస్వామి


సిరిసిల్లలో మంత్రి వివేక్‌ను సన్మానిస్తున్న నాయకులు

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తొమ్మిదిన్నర సంవత్సరాల పాలనలో కల్వకుంట్ల కుటుంబం తెలంగాణ రాష్ట్ర ఖజానాను ఖాళీ చేసిందని రాష్ట్ర కార్మిక శాఖ, ఉపాధి శిక్షణ, కర్మాగార, భూగర్భ గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. బుధవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని లహరి ఫంక్షన్ హాల్‌లో సకల జనుల ఆధ్వర్యంలో సన్మానం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరయ్యారు. ముందుగా అంబేద్కర్ చౌరస్తాలో ఆయనకు కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఎస్పీ, మహేష్ బి. గీతే, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు ఘనస్వాగతం పలికారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి మంత్రి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఫంక్షన్ హాల్‌లో మాల మహానాడు జాతీయ ప్రధాన కార్యదర్శి రాగుల రాములు అధ్యక్షతన సమావేశం జరిగింది. మంత్రి వివేక్ వెంకటస్వామికి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటాన్ని అందించి సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్‌వెంకటస్వామి మాట్లాడారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి కోరిక మేర కార్మిక క్షేత్రమైన సిరిసిల్లలో జౌళిశాఖ నుంచి కార్మికులకు న్యాయం చేసే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కల్వకుంట్ల కుటుంబం కోసమే పనిచేసిందని ఆరోపించారు. సిరిసిల్లలో ఒకప్పుడు ఇసుక మాఫియా ఉండేదని, ఆ మాఫియాతోనే దళితులు చనిపోయారని, మరికొందరిపై అక్రమ కేసులు బనాయించారని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై కేటీఆర్ ప్రాజెక్టుపై అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని అన్నారు. హైదరాబాద్‌కు 20 టీఎంసీల నీరు అందించాలని గతంలో వైఎస్ఆర్ ప్రభుత్వం రూ 30 వేల కోట్లతో ప్రాణహిత - చేవెళ్ల ప్రాజెక్టు చేపట్టిందన్నారు. ఆ ప్రాజెక్టు కోసం రూ 11 వేల కోట్లు ఖర్చు చేసిందన్నారు. కేసీఆర్ ఫామ్‌హౌజ్ కోసం మల్లన్నసాగర్ ప్రాజెక్టు నిర్మాణం జరిగిందని ఆరోపించారు. జిల్లా అభివృద్ధికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కృషి చేస్తున్నాడన్నారు. ప్రభుత్వ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ కార్మిక ధార్మిక క్షేత్రమైన సిరిసిల్ల జిల్లాకు కార్మిక మంత్రిగా వివేక్‌వెంకటస్వామి మొదటిసారిగా వచ్చారని, జౌళిశాఖపై అవగాహన ఉన్న వివేక్‌వెంకటస్వామి సిరిసిల్ల కార్మికులకు అండదండలు అందించాలని కోరారు. నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ఆవశ్యకతను నాడు ఏఐసీసీని మెప్పించి ఒప్పించిన వారిలో మొదటివాడు కాకానే అని అన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయం జిల్లా చైర్మన్ నాగుల సత్యనారాయణ, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ వెల్ముల స్వరూపతిరుపతిరెడ్డి, సబేరా బేగం, విజయతిరుపతి, రాణి, రాములు నాయక్ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, పట్టణ ఉపాధ్యక్షుడు బొప్ప దేవన్న, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, జిల్లా మహిళా అధ్యక్షురాలు కాముని వనిత, పీసీసీ మాజీ కార్యదర్శి గడ్డం నర్సయ్య, కత్తెర దేవదాస్, రొడ్డ రాంచంద్రం తదితరులు పాల్గొన్నారు.

## ధర్మపురిలో ఘనంగా సంకష్టహర చతుర్థి పూజలు


గణపతి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు, భక్తులు

ధర్మపురి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సంకష్టహర చతుర్థి సందర్భంగా ధర్మపురి క్షేత్రంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి అనుబంధ శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయం ఆవరణలో గల గణపతి ఆలయంలో గణపతి ఉపనిషత్‌లతో బుధవారం ఘనంగా అభిషేకం నిర్వహించారు. ఆలయ వేద పండితులు పాలెపు ప్రవీణ్‌కుమార్ శర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్చరణల మధ్య అర్చకులు ప్రత్యేక పూజలు, హారతి, మంత్ర పుష్ప కార్యక్రమాలు నిర్వహించారు. అనేక మంది భక్తులు ప్రత్యేక పూజలు చేసి స్వామి వారిని దర్శనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, అర్చకులు ద్యావళ్ల విశ్వనాథం, సాయికుమార్, అభిషేక్ పౌరోహితులు బొజ్జ సంతోష్‌కుమార్, రాజగోపాల్, స్థానిక వేదపండితులు మధు రామశర్మ, కాకెరి గోపాల్ శర్మ, జనుమంచి రాములు శర్మ ధర్మ కర్తలు గుడ్ల రవీందర్, రాపర్తి సాయికిరణ్, స్తంభంకాడి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## వేములవాడలో భవనంపై పిడుగుపాటు

వేములవాడ టౌన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వేములవాడ పట్టణంలో బుధవారం ఓ ఇంటిపై పిడుగు పడింది. పట్టణంలోని భగవంతరావునగర్‌లోని ఓ భవనంపై పిడుగు పడటంతో ఇంట్లోని ఎలక్ట్రానిక్ వస్తులు ధ్వంసమయ్యాయి. చిన్నపాటి వర్షం ఉరుములు, మెరుపులతో రావడంతో ఇంటి పైభాగంలోని గోడపై పిడుగుపడి కొంత భాగం కూలిపోయింది. ఇంట్లోని రిఫ్రిజిరేటర్, ఫ్యాన్‌లు ధ్వంసమయ్యాయి. ఇంట్లో ఉన్న వారికి ఎలాంటి అపాయం జరుగలేదు.

● కథలాపూర్ మండలం గంభీర్‌పూర్‌లో..

కథలాపూర్ : కథలాపూర్ మండలం గంభీర్‌పూర్‌లో బుధవారం సాయంత్రం పిడుగుపాటుకు చిలువేరి గంగనర్సయ్య అనే వ్యక్తి ఇల్లు పాక్షికంగా ధ్వంసమైంది. ఇంటి పనుల్లో నిమగ్నమైన గంగనర్సయ్య కుటుంబం పిడుగుపాటుకు ఒక్కసారిగా భయాందోళనలకు గురైంది. పిడుగుపాటుతో ఇంటి పైభాగం పెచ్చులూడి పడింది. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరుగలేదు.

## శ్రీరాంసాగర్‌కు కొనసాగుతున్న వరద

● 8 గేట్లు పైకి ఎత్తి 25 వేల క్యూసెక్కులు దిగువకు

జగిత్యాల, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి వరద గేట్ల ద్వారా గోదావరిలోకి నీరు వదలడం బుధవారం కొనసాగింది. ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతం నుంచి 54,545 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతుండగా 8 గేట్లు పైకి ఎత్తి 25 వేల క్యూసెక్కుల నీటిని దిగువ గోదావరికి వదులుతున్నారు. ప్రాజెక్టు నీటి నిల్వ 80.5 సామర్థ్యానికి ప్రస్తుతం 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వరద కాలువకు 19,000 క్యూసెక్కులు, కాకతీయ కాలువకు 5,500 క్యూసెక్కులు వదులుతున్నారు. ఈ యేడాది జూన్ 1వ తేదీ నుంచి ఇప్పటివరకు ఎగువ ప్రాంతం నుంచి ప్రాజెక్టులోకి 376.827 టీఎంసీ నీరు రాగా, 309.083 టీఎంసీల నీరు వదిలారు.

### శ్రీపాద ఎల్లంపల్లిలో..

పెద్దపల్లి : జిల్లాలో గల శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతం నుంచి వరద నీరు వచ్చి చేరుతున్నది. బుధవారం సాయంత్రం వరకు 75,266క్యూసెక్కుల వరద నీరు వస్తున్నది. ఎస్సారెస్పీ నుంచి 12,500 క్యూసెక్కులు, కడెం ప్రాజెక్టు నుంచి 5,252క్యూసెక్కులు, క్యాచ్‌మెంట్ ఏరియా నుంచి 57,514 క్యూసెక్కుల వరద నీరు వస్తున్నది. 10గేట్ల ద్వారా 75,266 క్యూసెక్కుల వరదనీటిని గోదావరిలోకి వదులుతున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టు నీటిమట్టం 20.175టీఎంసీలకు గాను, 20.175 టీఎంసీల నీళ్లు ఉన్నాయి.

### అన్నపూర్ణకు కొనసాగుతున్న ఎత్తిపోతలు


ఇల్లంతకుంట : మండలంలోని అనంతగిరి గ్రామ సమీపంలోని అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి రెండు పంపుల ద్వారా నీటి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. 3.5 టీఎంసీల సామర్థ్యం ఉన్న రిజర్వాయర్‌లో ప్రస్తుతం 3.12టీఎంసీల నీరు ఉంది. మధ్యమానేరు ద్వారా వస్తున్న 6400 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తుండగా ఎగువన ఉన్న రంగనాయకసాగర్ 6600క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.


### మిడ్ మానేరులోకి..

బోయినపల్లి : శ్రీరాజరాజేశ్వర జలాశయనికి (మిడ్‌మానేరు) ప్రాజెక్టు బుధవారం 13,400 ఇన్‌ఫ్లో కొసాగుతోంది. దిగివ ఉన్న ఎల్ఎండీ ప్రాజెక్టుకు నాలుగు గేట్ల ద్వారా 6వేల క్యూసెక్కులు ప్యాకేజీ 10లోని అన్నపూర్ణ రిజర్వాయర్‌కు 6400, ప్యాకేజీ 9లోని మల్కపేట రిజర్వాయర్‌కు 561క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 318 మీటర్లకు ప్రస్తుతం 317.76 ఉండగా, నీటి సామర్థ్యం 27.55 టీఎంసీలకు 26.940 టీఎంసీల మేరకు నీరు నిల్వ ఉంది.

# దివ్యాంగులకు అండగా ఉంటాం

● మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్


మాట్లాడుతున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్


దివ్యాంగుల నృత్యాలను తిలకిస్తున్న మంత్రి, ఎమ్మెల్యే, అధికారులు

తిమ్మాపూర్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని దివ్యాంగులకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, దివ్యాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ అన్నారు. రాష్ట్రంలోని 33 జిల్లాల్లో ఉన్న మానసిక దివ్యాంగుల పాఠశాలలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వం ప్రత్యేక నిధి ఏర్పాటు చేసిందని తెలిపారు. మండలంలోని ఎల్ఎండీ కాలనీలో జిల్లా స్వాతంత్ర్య సమరయోదుల ట్రస్ట్ ఆధ్వర్యంలో నడుస్తున్న మానసిక వికాలంగుల పాఠశాలలో ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి సహకారంతో బుధవారం ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 400 మంది దివ్యాంగులకు ఉపకరణాలు, ఇతర సంక్షేమ సహాయం కోసం దరఖాస్తు చేసుకున్నారన్నారు. త్వరలో వాటిని పరిశీలించి అర్హులను ఎంపిక చేస్తామన్నారు. మానసిక వికలాంగులకు సేవ చేస్తున్న సిబ్బందికి కలెక్టర్ల ద్వారా ఓ ఏజెన్సీ ఏర్పాటు చేసి వారికి అవుట్ సోర్సింగ్ ద్వారా జీతాలు ఇచ్చేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఆర్థిక శాఖ మంత్రితో మాట్లాడుతానని హామీ ఇచ్చారు. పాఠశాల ఇబ్బందులపై మాజీ ఎమ్మెల్యే, ట్రస్ట్ అధ్యక్షుడు చాడ వెంకటరెడ్డి ముఖ్యంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారని, దీనికి స్పదించిన సీఎం వెంటనే 50 లక్షల రూపాయల నిధులను మంజూరు చేసి ట్రస్టు అకౌంట్‌లో జమచేయించారని తెలిపారు. ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ దివ్యాంగులను ప్రేమతో ఆదరించాలన్నారు. దివ్యాంగుల సంక్షేమ శాఖ డైరెక్టర్ బి శైలజ మాట్లాడుతూ. దివ్యాంగుల సంక్షేమానికి బాల భరోసా కార్యక్రమాన్ని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రారంభించారన్నారు. మాజీ ఎమ్మెల్యే, ట్రస్టు చైర్మన్ చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ 2014 నుంచి మానసిక వికలాంగుల పాఠశాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి గ్రాంట్ రాకపోవడంతో సిబ్బందికి జీతాలు ఇచ్చే పరిస్థితి లేక చాలా ఇబ్బందికరంగా పాఠశాలను నడిపిస్తున్నామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి తమ సమస్యలను తెలపడంతో వెంటనే స్పందించి 50 లక్షల గ్రాంటును విడుదల చేశారని తెలిపారు. వొకేషనల్ కోర్సుల కోసం మరో 40లక్షల నిధులు కేటాయించాలని మంత్రిని కోరారు. అనంతరం దివ్యాంగుల పిల్లలతో కలిసి మంత్రి, ఎమ్మెల్యే, అధికారులు కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాఖడే, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి, ట్రస్ట్ సభ్యులు కొమ్మురెల్లరెడ్డి, భగవాన్, వెంకటయ్య, ఏవో బాలరాజు, ప్రిన్సిపాల్ సతీష్ పాల్గొన్నారు.

## రచయిత డాక్టర్ కిరణ్‌కు 'వడ్డేపల్లి' జాతీయ సాహిత్య పురస్కారం


కిరణ్

సిరిసిల్ల సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్లకు చెందిన రచయిత, కవిగా డాక్టర్ చిటికెన కిరణ్ కుమార్‌కు అఖిల భారత పద్మశాలి సంక్షేమ సంఘం అందించే డాక్టర్ వడ్డేపల్లి కృష్ణ జాతీయ సాహిత్య పురస్కారానికి ఎంపిక చేసినట్లు సంఘ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిలు తుమ్మ సత్యనారాయణ, సూరేపల్లి రవికుమార్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. డాక్టర్ కిరణ్ కుమార్ చైతన్య స్ఫూర్తి వంటి సంకలనం, ఓ తండ్రి తీర్పు లఘు చిత్రకథ, కవితలు, వ్యాసాలు ప్రత్యేక గుర్తింపును తెచ్చిపెట్టాయి. సుప్రసిద్ధ సినీ గేయరచయిత డాక్టర్ వడ్డేపల్లి కృష్ణ స్మారకార్థం సాహిత్య పురస్కారాన్ని అందిస్తున్నారు. త్వరలోనే హైదరాబాద్‌లో జరగబోయే ప్రత్యేక కార్యక్రమంలో కిరణ్‌కు అవార్డును ప్రదానం చేయనున్నట్లు వెల్లడించారు.

# ఘనంగా చాకలి ఐలమ్మ వర్ధంతి


సిరిసిల్లలో నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు,


సిరిసిల్లలో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్, రజక సంఘం నాయకులు,



ఎల్లారెడ్డిపేట, వేములవాడలలో నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

సిరిసిల్ల రూరల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ సాయుధ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ అని సీపీఎం జిల్లా కార్యదర్శి మూషం రమేష్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణలు అన్నారు. సిరిసిల్ల పట్టణంలోని సీపీఎం పార్టీ అధ్వర్యంలో బుధవారం చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా ఐలమ్మ విగ్రహానికి నివాళ్లు అర్పించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు ఎగమంటి ఎల్లారెడ్డి, మల్లారపు అరుణ్‌కుమార్, జిల్లా కమిటి సభ్యులు సూరం పద్మ, గురజాల శ్రీధర్, శ్రీరాముల రమేష్‌చంద్ర, దాసరి రూప, మిట్టపల్లి రాజమౌళి, బెజుగం సురేష్, బింగి సంపత్, కోల శ్రీనివాస్, ప్రభాకర్ పాల్గొన్నారు.

సిరిసిల్ల అర్బన్ పరిధిలోని పలు గ్రామాల్లో ఐలమ్మ వర్ధంతి నిర్వహించారు. మాజీ కౌన్సిలర్లు పోచవేణి సత్యఎల్లయ్య, బుర్ర లక్ష్మీశంకరయ్య, చెన్నమనేని కీర్తికమలాకర్‌రావు, కల్లూరి లతమధు, భూక్య రెడ్డినాయక్, మాజీ కోఆప్షన్‌సభ్యులు గొల్లపల్లి బాలయ్యగౌడ్, మాజీ ఎంపీటీసీ బుర్ర మల్లిఖార్జున్ గౌడ్, రజక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

● సిరిసిల్ల టౌన్ : జిల్లా కేంద్రంలో రజక సంఘం ఆధ్వర్యంలో ఐలమ్మ వర్ధంతి నిర్వహించారు. చాకలి ఐలమ్మ విగ్రహానికి కాంగ్రెస్, సీపీఐ, రజక సంఘం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, మార్కెట్ కమిటి డైరెక్టర్ కాసర్ల రాజు, సీపీఐ పట్టణ కార్యదర్శి పంతం రవి, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు, అధ్యక్షుడు అజ్జ వేణు, నాయకులు సోమ నాగరాజు, కూర రాకేష్, రజక సంఘం నాయకులు పాల్గొన్నారు.

● ఎల్లారెడ్డిపేట : మండల కేంద్రంతో పాటు వెంకటాపూర్, నారాయణపూర్, రాచర్లగొల్లపల్లి తదితర గ్రామాల్లోని రజక సంఘాల ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ వర్ధంతి నిర్వహించారు. మండలకేంద్రంలోని ఐలమ్మ విగ్రహానికి ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సయ్య, నాయకులు లక్ష్మారెడ్డి, నర్సింలు, సుభాష్, రాంరెడ్డి, తిరుపతి, గిరిధర్‌రెడ్డి, కిషన్, బుచ్చాగౌడ్, బాబు, శ్రీనివాస్, కిష్టయ్య, సురేశ్, బాల్‌రెడ్డి, కార్తీక్, నర్సింలు పాల్గొన్నారు.

● చందుర్తి : మండల కేంద్రంలో రజక సంఘం ఆధ్వర్యంలో ఐలమ్మ వర్ధంతి నిర్వహించారు. సింగిల్ విండో చైర్మన్ తిప్పని శ్రీనివాస్,మండల అధ్యక్షులు సుద్దాల నర్సయ్య, నాయకులు చిలుక పెంటయ్య,సిరికొండ శ్రీనివాస్, గొట్టె ప్రభాకర్, పులి సత్తయ్య, చిర్రం తిరుపతి, బత్తుల కమలాకర్, కొడగంటి గంగాధర్, బాలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

● కోనరావుపేట : మండల కేంద్రంతో పాటు కనగర్తి తదితర గ్రామాల్లో చాకలి ఐలమ్మ వర్ధంతిని నిర్వహించారు. రజక సంఘం నాయకులు జీనుక కరుణాకర్, పరుశురాములు, వెంకటి, చంద్రయ్య ఉన్నారు.

● ముస్తాబాద్ : మండల కేంద్రంలో చాకలి ఐలమ్మ వర్ధంతి నిర్వహించారు. కొత్త బస్టాండ్ వద్ద గల చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళుర్పించారు. రజక సంఘం నాయకులు సుద్దాల దేవయ్య, సింగాపూర్ సత్తయ్య, శరయ్య, యాదగిరి, నారాయణ , బాలరాజు, నర్సయ్య, నర్సింలు భాను, భిక్షపతి పాల్గొన్నారు.

● తంగళ్లపల్లి : మండలంలో బస్వాపూర్, తంగళ్లపల్లి గ్రామాల్లో చాకలి ఐలమ్మ వర్ధంతి నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జల్గం ప్రవీణ్‌కుమార్, పెద్దూరి తిరుపతి, సుద్దాల శ్రీనివాస్, ఆరేపల్లి బాలు, హమీద్, ఎగుర్ల ప్రశాంత్, కిషన్, చెన్నమనేని ప్రశాంత్, బండి పర్శరామ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే బస్వాపూర్‌లో రజక సంఘం ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ వర్ధంతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అక్కరాజు శ్రీనివాస్, బుర్గుపెల్లి బాలయ్య, పుర్మాణి లక్ష్మారెడ్డి, గోడిసెల ఎల్లయ్య, కర్నె బాలయ్య, మోతే మహేశ్, గొడిసెల తిరుపతి, కార్యదర్శి వేణు, నజ్జన ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

● వేములవాడ కల్చరల్ : వేములవాడ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఐలమ్మ వర్ధంతి నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ హాజరై ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణలో సామాజిక న్యాయం కోసం పోరాడిన అగ్రగామి మహిళా యోధురాలిన, ఆమె ధైర్యసాహసాలు నేటి తరానికి ప్రేరణనిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తదితరులు ఉన్నారు.

వేములవాడ టౌన్ : తెలంగాణ వీర వనిత చాకలి ఐలమ్మ వర్ధంతిని పట్టణ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వేములవాడ పట్టణంలోని తెలంగాణ చౌక్ వద్దగల ఐలమ్మ విగ్రహానికి మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఏనుగు మనోహర్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ సెస్ డైరెక్టర్ రామతీర్థపు రాజు నాయకులు గడ్డం హన్మాండ్లు, నరాల శేఖర్, నిమ్మశెట్టి విజయ్, నీలం శేఖర్, కుమార్, శంకర్, చందు, మహేష్, మ్యాకల శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

# యథేచ్ఛగా కాలువ భూములు కబ్జా

- పట్టించుకోని అధికారులు
- రైతులకు అక్రమార్కుల బెదిరింపులు

చందుర్తి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండలంలో శ్రీపాద ఎల్లంపల్లి కాలువల నిర్మాణానికి సేకరించిన భూమి పలు చోట్ల ఆక్రమణకు గురవుతోంది. పంటలకు నీరందించేందుకు నిర్మించిన కాలువలను ధ్వంసంచేసి కొందరు ఆక్రమించి పూడ్చేస్తున్నారు. కొన్నిచోట్ల నిబంధనలకు విరుద్ధంగా కాల్వలను చదును చేసి పంటలు పండిస్తున్నారు. చందుర్తి మండలం మల్యాల శివారులో దొంగల మర్రికుంట్ల, పెద్దవాగు డిస్ట్రిబ్యూటరీ కాలువ (6)ఆక్రమణకు గురవుతోంది. కొందరు అక్రమార్కులు కాలువను పూడ్చివేశారు. మండల కేంద్రం శివారులో అటవీ ప్రాంతం వద్ద నిర్మించిన 450 ప్రాజెక్టు ట్యాంకు నుంచి పంట పొలాలకు నీరు వెళ్లేందుకు కుడి, ఎడమ కాలువలను నిర్మించారు. ఈ కాలువలను కొందరు సిమెంట్ వాల్‌తోపాటు, రోడ్డును ధ్వంసం చేయగా, మరికొన్నిచోట్ల పూర్తిగా మట్టితో పూడ్చివేసి, పంటపొలాలు చేసి భూమి ఆక్రమించారు. ఇదేమిటని ప్రశ్నిస్తే చంపుతామని బెదిరిస్తున్నారని అటుగా వెళ్లే రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోవడం లేదని బాధిత రైతులు వాపోతున్నారు. నీటిపారుదల శాఖ అధికారులు సైతం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహ రిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఈ అంశం తమ పరిధిలోకి రాదంటూ రెవెన్యూ అధికారుల దగ్గరికి వెళ్లాలంటూ బాధితులకు నీటిపారుదల అధికారులు సూచిస్తున్నారు. రెవెన్యూ అధికారులు ఈ అంశం తమ పరిధిలోకి రాదంటూ వారు చేతులెత్తేస్తున్నారు. నీటిపారుదల శాఖ అధికారులు చూసుకుంటారంటూ చెప్తున్నారు. కాలువలను పరిరక్షించాల్సిన నీటిపారుదల శాఖ అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కాలువల నిర్మాణం అప్పుడు, భూ సేకరణ సమయంలో నష్టపరిహారం పొందినప్పటికీ కొందరు భూమిని యథేచ్ఛగా సాగు చేస్తున్నారు. మరికొన్ని చోట్ల అక్రమార్కులు కన్నేసి ఆక్రమణాలకు తెరలేపారు. నీటి పారుదల శాఖలోని కొందరు అధికారుల ప్రోత్సాహంతోనే ఇదంతా జరుగుతోందని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ జిల్లా అధికారులు చొరవ తీసుకొని కాలువల ఆక్రమణాలపై చర్యలు తీసుకోవాలని మండల రైతుల కోరుతున్నారు.


ఆక్రమణకు గురైన కాలువను చూపిస్తున్న రైతు

## చంపేస్తామని బెదిరిస్తున్నారు..

- పత్తిపాక మల్లయ్య, రైతు, మల్యాల



మల్యాల గ్రామ శివారులోని శ్రీపాద ఎల్లంపల్లి కాలువపై రోడ్డు నుంచి వస్తే చంపేస్తామని అక్రమార్కులు బెదిరిస్తున్నారు. ఇరిగేషన్ శాఖ, రెవెన్యూ శాఖ అధికారులకు పిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదు. అధికారులు కాలువకు సంబంధించి ప్రభుత్వ భూమి హద్దులను త్రోవ హద్దులను ఏర్పాటు చేసి, అట్టి రోడ్డు తిరిగి నిర్మించి, రోడ్డు ధ్వంసం చేసిన వారిపై వ్యక్తులపై చర్యలు తీసుకోవాలి.

## కబ్జా చేసిన వారిపై పోలీసులకు ఫిర్యాదు చేశాం

- పి.సంతుప్రకాష్‌రావు, నీటి పారుదల శాఖ ఈఈ, వేములవాడ

- మల్యాల గ్రామ శివారులోని శ్రీపాద ఎల్లంపల్లి కాలువ భూమి కబ్జా చేసిన వారిపై పోలీసులకు ఫిర్యాదు చేయడం జరిగింది. రెండు రోజుల్లో కాలువలోని మట్టిని తొలగించి సమస్య పరిష్కరిస్తాం.

# 'సెస్'పై విలీనం కుట్ర..?

(5వ పేజీ తరువాయి)

పాఠశా లలు, దేవాలయాలు, 1049 ఉండగా, వీటికి సంబంధించి రూ 2.37 కోట్లు బకాయిలు రావాల్సి ఉన్నాయి. జిల్లాలో సెస్ వినియోగదారుల నుంచి వివిధ కనెక్షన్లకు సంబంధించి రూ 178.97 కోట్ల బకాయిలు రావాల్సి ఉంది. ప్రభుత్వం 24 గంటల ఉచిత విద్యుత్‌ను అందిస్తున్నా వ్యవసాయదారుల నుంచి సర్వీస్ రుసుము నుంచి రావాల్సిన బకాయిలు రూ 15.10 కోట్లు రావాల్సి ఉంది. గృహాలకు సంబంధించి రూ 40.55 కోట్లు, కమర్షియల్‌కు సంబంధించి రూ 21.90 కోట్లు, పరిశ్రమలకు సంబంధించి రూ 44.14 కోట్లు, మరమగ్గాల పరిశ్రమ నుంచి రూ3.69కోట్లు బకాయిలు రావాల్సి ఉంది.

## ● లాభాల బాటలో సెస్ పయనం

దేశంలోనే సహకార రంగంలో అగ్రగామిగా నిలిచిన సిరిసిల్ల సహకార విద్యుత్ సరఫరా సంఘం లాభాల బాటలో పయనిస్తోంది. 2025-26 సంవత్సరానికి సంబంధించి ఈఆర్సీ ప్రతినెల రూ.17కోట్ల వరకు వ్యాపారం ఉండాలని సెస్‌కు సిఫార్సు చేసింది. సెస్ పాలకవర్గం చేపట్టిన సంస్కరణలతో రూ 19.06 కోట్లుగా ముందుకుపోతోంది. ఈఆర్సీ చూపిన దానికంటే రూ.రెండు కోట్లపైనే డిమాండ్‌ను పెంచుకుంది. దీంతోపాటు ఈఈర్సీ 2024-25 సంవత్సరానికి సంబంధించి 964.08 కోట్ల విలులైన యూనిట్ల కొనుగోలుకు అనుమతి ఇస్తే సెస్ 1118.73 కోట్ల విలువైన యూనిట్లు కొనుగోలు చేసింది. సబ్సిడీ రెవెన్యూ కలుపుకొని రూ 571.86 కోట్ల వ్యాపారం జరిగింది. లాభాల పయనంలో సెస్ భవిష్యత్ ఏమిటనే చర్చ జరుగుతోంది.

## పట్టు పరిశ్రమపై రైతులు దృష్టి సారించాలి

చందుర్తి సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతంలో రైతులు పట్టు పరిశ్రమపై దృష్టి సారించాలని మైసూర్‌లోని సీఎస్బీ- సీఎస్ఆర్టిఐ శాస్త్రవేత్త మల్లికార్జున అన్నారు. చందుర్తి మండలం కిష్టంపేట గ్రామంలో మేరా రేషమ్ మేరా అభిమాన్ ప్రచార కార్యక్రమంలో భాగంగా రైతులకు పట్టు పరిశ్రమపై బుధవారం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మల్బరీ తోట, పట్టుపురుగుల నిర్వహణ, కొత్త ఆవిష్కరణ సాంకేతికతలు అనే అంశంపై అవగాహన కల్పించారు. ములుగులోని సీఎస్‌బీ-ఆర్ఎస్ఆర్ఎస్ డాక్టర్ జీ రాఘవేందర్ మాట్లాడుతూ సబ్సిడీ పథకాలు, పట్టుపురుగుల పెంపకంపై కన్వర్జెన్స్‌పై వివరించారు. ఏఎస్ఓ జగన్‌రావు మాట్లాడుతూ మండలంలో పట్టు పురుగుల సాగు విస్తరణకు సహకారం అందజేస్తామన్నారు.

## జిల్లా స్థాయి వ్యాస రచన, చిత్రలేఖనం పోటీలు

- విజేతలకు బహుమతులు ప్రదానం


విజేతలను అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయురాలు

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని భారతీయ జీవితా బీమా సంస్థ కార్యాలయంలో విద్యార్థులకు జిల్లాస్థాయిలో వ్యాస రచన, చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. వ్యాసరచన పోటీలో నెహ్రూనగర్ జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు ఆడెపు రచన మొదటి స్థానం, ముత్యం కావ్య తృతీయ స్థానంలో నిలిచారు, చిత్రలేఖనంలో స్వర్గం ప్రణీత్ మొదటి స్థానంలో నిలిచాడు. విజేతలైన విద్యార్థులకు సంస్థ బహుమతులతోపాటు మెరిట్ సర్టిఫికట్లను అందించి అభినందించారు. విజేతలైన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నాగుల భాగ్యరేఖ అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

## ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం

ఇల్లంతకుంట, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఉత్తమ ఉపాధ్యాయులను ఎమ్మార్సీ భవనంలో సత్కరించారు. మండలస్థాయి, జిల్లాస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా నిలిచి అవార్డులు పొందిన వివిధ పాఠశాలల ఉపాధ్యాయులతో సమావేశం జరిగింది. కార్యక్రమంలో మండల విద్యాధికారి చెప్యాల శ్రీనివాస్‌గౌడ్, ప్రధానోపాధ్యాయులు ప్రేమలత, గోవర్ధన్, రేవతి, కొమ్ముర‌మేష్, గుర్రం సందీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మాజీ సర్పంచ్ కుటుంబానికి పరామర్శ

తంగళ్లపల్లి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం వేణుగోపాల్‌పూర్ మాజీ సర్పంచ్ పీసు మల్లారెడ్డి కుమారుడు సిరిసిల్ల సింగిల్ విండో ఉద్యోగి వెంకటరమణరెడ్డి మృతిచెందాడు. బుధవారం కుటుంబాన్ని నాఫ్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు పరామర్శించారు. కుటుంబాన్ని ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్యాక్స్ చైర్మన్ బండి దేవదాస్, వైస్‌చైర్మన్ ఎగుమామిడి వెంకటరమణరెడ్డి, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు గజభీంకర్ రాజన్న, ఉమారెడ్డి సత్యనారయణ రెడ్డి, పడిగెల రాజు, సింగిల్ విండో సిఈవో బుర్ర నరేష్, సుధాకర్‌రెడ్డి, సాగర్‌రెడ్డి తదితరలు పాల్గొన్నారు.

## బోర్డును తొలగించిన గుర్తు తెలియని వ్యక్తి

కోనరావుపేట, సెప్టెంబర్ 10 (ఆంధ్రజ్యోతి) : కోనరావుపేట మండలం మరిమడ్ల,వేములవాడ సిరిసిల్ల జంక్షన్ వద్ద ఉన్న మరిమడ్ల సూచిక బోర్డును గుర్తుతెలియని వ్యక్తులు తొలగించి చెట్లపొదల్లో పారేశారు. ఇది గమనించిన గ్రామస్తులు బుధవారం జంక్షన్ వద్ద ఉన్న సూచిక మరిమడ్ల బోర్డును కష్టపడి బాగు చేసుకున్నారు. కోనరావుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు.

# సిరిసిల్లలో కార్మికశాఖ అధికారిని ఏర్పాటు చేయాలి

- మంత్రి గడ్డం వివేక్‌కు సీపీఎం నాయకుల విజ్ఞప్తి

సిరిసిల్ల రూరల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్లలో కార్మికశాఖ అధికారితోపాటు ఈఎస్ఐ అసుపత్రిలను ఏర్పాటుచేయడంతో పాటు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల కోసంతో పాటు పట్టణ అవసరాల కోసం ఇసుక సమస్యలను పరిష్కారించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మూషం రమేష్ కోరారు. సిరిసిల్లలో బుధవారం రాష్ట్ర కార్మిక ఉపాధి శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి పర్యటన సందర్భంగా అయనను సీపీఎం నాయకులు కలిసి వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ సిరిసిల్ల పట్టణంలో ఇందిరమ్మ ఇళ్లను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేయడం హర్షనీయన్నారు. ఈ కార్యక్రమంలో బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు మిట్లపల్లి రాజమౌళి, ఎగమంటి ఎల్లారెడ్డి, కోల శ్రీనివాస్ పాల్గొన్నారు.


సిరిసిల్లలో మంత్రి గడ్డం వివేక్‌ను కలిసిన సీపీఎం నాయకులు

## అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణానికి భూమిపూజ

తంగళ్లపల్లి, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంకిరెడ్డిపల్లె, బద్దనపల్లి గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలకు కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, నాయకులు భూమిపూజ చేశారు. రూ.24లక్షల నిధులు రెండు భవనాలకు నిధులు మంజూరయ్యాయి. మార్కెట్‌కమిటీ వైస్ చైర్మన్ నేరెళ్ల నర్సింగంగౌడ్, ఏంఈవో బుక్యా రాజు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సుష్మిత, ఏఈ మహేశ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జల్గం ప్రవీణ్,ఆరేపల్లి బాలు, పర్శరాములు తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ నిర్మాణానికి విరాళం

చందుర్తి,సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎల్లమ్మ దేవాలయం ఆవరణలో గౌడ కులస్తుల ఆధ్వర్యంలో నిర్మిస్తున్న శ్రీమల్లికార్జున స్వామి ఆలయ నిర్మాణానికి మండల కేంద్రానికి చెందిన మోతే రాములు రూ.5లక్షలు బుధవారం అందజేశారు. సింగిల్‌విండో చైర్మన్ తిప్పని శ్రీనివాస్, మాజీ ఎంపీపీ పెంటయ్య, గొట్టె ప్రభాకర్, కత్తి శంకర్, లింగాల మల్లయ్య, తిరుపతి, గంగాధర్, వెంకటేశం, నారాయణ, పాల్గొన్నారు.

# కోర్టు విధులు బహిష్కరించిన న్యాయవాదులు


విధులు బహిష్కరించి నిరసన తెలుపుతున్న సిరిసిల్ల న్యాయవాదులు

సిరిసిల్ల క్రైం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): న్యాయవాదులపై దాడులను నిరసిస్తూ సిరిసిల్ల బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం న్యాయవాదులు కోర్టు విధులను బహిష్కరించారు. ఇటీవల మెద్చల్ మల్కాజ్‌గిరి, ఖమ్మం, అదిలాబాద్ కోర్టుల పరిధిలో వేర్వేరుగా న్యాయవాదులపై దాడులు చేయడాన్ని ఖండిస్తూ న్యాయవాదులు కోర్టు విధులు బహిష్కరించి ప్రధాన ద్వారం ఎదురుగా బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు జూపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ న్యాయవాదుల రక్షణ చట్టాన్ని తీసుకువస్తామని చెప్పికాంగ్రెస్ పార్టీ తన మెనిఫెస్టోలో పెట్టి అధికారంలోకి వచ్చిందన్నారు. ఇందుకోసం న్యాయవాదుల రక్షణ చట్టం డ్రాఫ్ట్ బిల్లుపై కమిటీ వేసిందన్నారు. ఇప్పటికైనా అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టి గవర్నర్ ఆమోదానికి పంపి వెంటనే న్యాయవాదుల రక్షణ చట్టాన్ని అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వెంకటి, సీనియర్ న్యాయవాదులు వసంతం, ధర్మేందర్, సురేష్, నర్సింగరావు, రవిందర్ రావు, రమాకాంత్‌రావు, సంజీవరెడ్డి, చెక్కిళ్ల మహేష్‌గౌడ్, లక్ష్మణ్, అనిల్‌కుమార్, నర్మెట్ట రమేశ్, వేముల నరేశ్ విష్ణు, వేణు, తదితరులు పాల్గొన్నారు.

● వేములవాడ టౌన్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు న్యాయవాదులకు రక్షణ చట్టాన్ని తీసుకురావాలని బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కట్కం జనార్ధన్ అన్నారు. మేడ్చల్, ఖమ్మం జిల్లాలో సురేష్‌బాబు, జహంగీర్ అలీపై జరిగిన దాడికి నిరసనగా బుధవారం న్యాయవాదులు వేములవాడ కోర్టు ముందు నిరసన వ్యక్తంచేశారు. న్యాయవాదులపై దాడులు చేసిన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

## ఎస్టీయూ మండల కార్యవర్గం

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఎస్టీయూ సిరిసిల్ల మండల నూతన కార్యవర్గంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కే రాజేష్, ప్రధానకార్యదర్శిగా బి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా కే వెంకటేశ్వర్లు, కోశాధికారిగా కమల్ నయన్, మహిళా ఉపాధ్యక్షురాలుగా జి ప్రసన్న, కార్యదర్శులుగా అంజలి, నాగజ్యోతి, శ్రీలత, ఆర్థిక శాఖ సభ్యులుగా సంధ్యారాణి, కీర్తిలను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గం సభ్యులను ఎన్నికల పరిశీలకులు, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు మొగిలి లక్ష్మన్, ప్రధాన కార్యదర్శి రేపాజు సదానందం, ఉపాధ్యాయులు అభినందించారు. అనంతరం పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలో ఎస్టీయూ నూతన సభ్యత్వాలను ప్రారంభించారు.

## బాధిత కుటుంబాలకు పరామర్శ

ఎల్లారెడ్డిపేట/వీర్నపల్లి, సెప్టెంబరు10(ఆంధ్రజ్యోతి) : ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి మండలాల్లోని పలు బాధిత కుటుంబాలను బీఆర్ఎస్, బీజేపీ నాయకులు బుధవారం వేర్వేరుగా పరామర్శించారు. ఆయా కార్యక్రమాల్లో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య, ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్లు కృష్ణహరి, మల్లేశం, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గోపి, రాజిరెడ్డి, సుభాష్, రమేశ్‌గౌడ్, రాజం, నారాయణ, శ్రీరాంనాయక్, రఫీక్, తిరుపతిరెడ్డి, ప్రదీప్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, శ్రీనివాస్, సుధాకర్, శేఖర్, వంశీ పాల్గొన్నారు.

## తహసీల్దార్‌కు సన్మానం

చందుర్తి సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : చందుర్తి తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన లగిశెట్టి భూపతిని చందుర్తి మండల బీజేపీ నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం భూపతిని సత్కరించారు. బీజేపీ ప్రధానకార్యదర్శి సిరికొండ శ్రీనివాస్ పోంచేటి రాకేష్, చిర్రం తిరుపతి పెరిక గంగరాజు,పెరిక రంజిత్, చింతకుంట గంగాధర్, శ్రీకాంత్, తదితరులు ఉన్నారు.

## సేవలతోనే గుర్తింపు లభిస్తుంది..

కోనరావుపేట, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఉద్యోగులు చేసిన సేవలకు ప్రభుత్వం గుర్తిస్తుందని ఎంఈవో మురళినాయక్ అన్నారు. మండలంలోని కనగర్తి ప్రభుత్వపాఠశాలలో ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డు పొందిన గోలి రాధాకిషన్, పరకాల బాల్‌రెడ్డిలను సన్మానించి మాట్లాడారు. ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు వినోద్ కుమార్, నర్సయ్య రమణారెడ్డి, సంపూర్ణ, భూంరెడ్డి, లక్ష్మారెడ్డి, తదితరులు ఉన్నారు.

## ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా పురస్కారం అందుకున్న ఎల్లారెడ్డిపేట మండలం అల్మాస్‌పూర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు దేవేందర్‌ను స్థానిక పాఠశాలలో బుధవారం ఘనంగా సన్మానించారు. హెచ్ఎం కుమారస్వామి, తాజా, మాజీ ఎంపీపీ రేణుక, అమ్మ ఆదర్శ కమిటీ చైర్‌పర్సన్ శిరీష, ఏఎంసీ డైరెక్టర్ బాలయ్య, స్థానికులు ఇంద్రారెడ్డి, బాలగౌడ్, కిషన్, సురేశ్, కృష్ణహరి, శ్రీనివాస్, అంజయ్య, శంకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరం

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వీర్నపల్లి మండలం అడవిపదిర గ్రామంలో ఐఎంఏ, మానేరు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఎల్లారెడ్డిపేట పట్టణంలోని అశ్విని ఆసుపత్రి సౌజన్యంతో బుధవారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వైద్య నిపుణులు శ్రీనివాస్, అభినయ్, భాస్కర్, సురేంద్రబాబు, సాయిసుప్రియ, చైతన్యశ్రీ, నాగార్జున నేతృత్వంలోని వైద్య సిబ్బంది 120 మందికి రక్త, మూత్ర పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఐఎంఏ అధ్యక్షుడు వైద్యులు, శ్రీనివాస్, కార్యదర్శి అభినయ్, సంస్థ చైర్మన్ చింతోజు భాస్కర్, వైద్యులు, సిబ్బంది తదిరులు పాల్గొన్నారు.

## వాటర్ ప్యూరిఫైయర్ సామగ్రి వితరణ

ముస్తాబాద్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గూడెం గ్రామానికి చెందిన పారిశ్రామికవేత్త చిట్నేని వెంకటేశ్వర్‌రావు-మాధవి దంపతులు ప్రభుత్వ పాఠశాలకు ఆర్‌వో వాటర్ ప్యూరిఫైయర్ మెటీరియల్‌ను మండల విద్యాధికారి రాజిరెడ్డి చేతుల మీదుగా బుధవారం అందించారు. అలాగే అలారమ్ బెల్‌ను విరాళంగా అందించారు. కార్యక్రమంలో మాజీ ఎఎంసీ చైర్మన్ చిట్నేని అంజనేయరావు, మాజీ సర్పంచ్ చిట్నేని సరితశ్రీనివాస్‌రావు, మాజీ ఉపసర్పంచ్ చాడ శ్రీనివాస్, విద్యాసాగర్, కోల అక్షయ్, ఎల్లాగౌడ్, బాలయ్య, బొంపెల్లి సురేందర్‌రావు, కమలాకర్ పాల్గొన్నారు.

## సాయుధ రైతాంగ పోరాట ఉత్సవాలను నిర్వహించాలి

ముస్తాబాద్, సెప్టెంబర్ 10 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట ఉత్సావాలను గ్రామగ్రామాన నిర్వహించాలని సీపీఐ జిల్లా మాజీ కార్యదర్శి గుంటి వేణు పేర్కొన్నారు బుధవారం గుంటి వేణు మాట్లాడుతూ సెప్టెంబర్ 11 నుంచి 17వరకు తెలంగాణ రైతాంగ పోరాట వారోత్సావాలను నిర్వహించాలని అమరుల స్థుపాల వద్ద నివాళులర్పించాలని ఎర్రజెండాలు ఎగురవేయాలని పిలుపునిచ్చారు. మండలంలో ఎందరో మంది భూమి కోసం భుక్తి కోసం పోరాటం చేసి అమరులయ్యారని గుర్తు చేశారు. రైతాంగ 79వ వార్షికోత్సవ సందర్భంగా తెలంగాణ కోసం అమరులైన నాలుగు వేల మంది యుద్ధ గెరిల్లాలను స్మరించుకుందామన్నారు..

## కేర్ టేకర్ నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

ముస్తాబాద్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నామాపూర్‌లో గల తెలంగాణ రాష్ట్ర ఆదర్శ పాఠశాలలో గల బాలికల హాస్టల్‌లో కేర్ టేకర్ పని చేయడానికి ఆసక్తిగల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని మండల విద్యాధికారి రాజిరెడ్డి పేర్కొన్నారు. ఈనెల 15వతేదీ సాయంత్రం అయిదు గంటల లోపు స్థానిక ఎంఆర్సీలో దరఖాస్తు చేసుకోవాలని మహిళా అభ్యర్థులు, వయసు 18-45 సంవత్సారాలలోపు ఉండాలని, విద్యార్హతలు డిగ్రీ పాసై ఉండాలని డీఈడీ, బీఈడీ చేసిన వారు మాత్రమే అర్హులని పేర్కొన్నారు.

## ట్రాక్టర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పర్శరాం

ఇల్లంతకుంట, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి) : మండలంలోని రహీంఖాన్‌పేట ట్రాక్టర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఉత్కం పర్శరాంగౌడ్ ఎన్నికయ్యాడు. గ్రామంలో బుధవారం జరిగిన సమావేశంలో ఉపాధ్యక్షుడిగా మామిడి శ్రీనివాస్‌పటేల్, కోశాధికారిగా పెంకాను రమేష్‌ముదిరాజ్‌లతోపాటు సభ్యులను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గానికి పలువురు అభినందనలు తెలిపారు.

## పోస్టర్ ఆవిష్కరణ

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల మసీద్ కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 12న మహమ్మద్ ప్రవక్త జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నామని అధ్యక్షుడు సయ్యద్ సమీ అన్నారు. బుధవారం పట్టణంలోని మసీద్‌లో వేడుకల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా సమీ మాట్లాడుతూ ప్రపంచానికి శాంతి సందేశాన్ని అందించి ప్రవక్త జన్మదిన వేడుకల్లో భాగంగా పట్టణంలో బైక్ ర్యాలీ, శోభాయాత్ర ఉంటుందన్నారు. సాయంత్రం మహమ్మద్ ప్రవక్త ప్రవచనాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో మసీద్ కమిటీ మాజీ అధ్యక్షుడు ఎండీ సలీం, ప్రధాన కార్యదర్శి రఫీ, మౌలాన ఘని, షాదాబ్, అజ్మత్, అజ్మత్ పాల్గొన్నారు.

## చాకలి ఐలమ్మ పోరాటం ప్రజా ఉద్యమాలకు నాంది..

- మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్


ఇల్లంతకుంటలో నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

ఇల్లంతకుంట, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ పోరాటం ప్రజా ఉద్యమాలకు నాందిగా నిలిచిందని మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పేర్కొన్నారు. మండలంలోని పలు గ్రామాలలో బుధవారం చాకలి ఐలమ్మ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండలకేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జడ్పీమాజీ వైస్ చైర్మన్ సిద్దం వేణు,బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పల్లె నర్సింహ్మారెడ్డి, సెస్‌డైరెక్టర్ రవీందర్‌రెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ చింతపల్లి వేణురావు, నాయకులు చెరుకుపల్లి రాజిరెడ్డి, గొడుగు తిరుపతి, కేవీఎస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.